సాహితీ గత వారంరోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
అనంతపురం
: fb.com/vaartha Digital
Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-3-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 52 పేజీలు: 08+4 వెల: 6.50

ఓట్ల కోసం లక్షల కోట్ల ఎన్నికల వ్యయం అవసరమా?

జస్టిస్ యశ్వంత్ వర్మ తిరిగి అలహాబాద్ హైకోర్టుకు..

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

## ముందస్తు జాగ్రత్తలతో వడదెబ్బ మరణాలు నివారించాలి

## పాఠశాలల్లో వాటర్‌బెల్ విధానం

## వేసవి ప్రణాళికపై సీఎం చంద్రబాబు



**విజయవాడమార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి సమస్య కనిపించకుండా చూడాలన్నారు..అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లకు వెంటనే మరమ్మత్తులు చేయించాలి.మంచినీటి ఎద్దడి ఉన్న శివారు ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్లు,ఇతర ప్రత్యామ్నాయ పద్దతుల్లో నీరు అందించాలన్నారు. వేసవి ప్రణాళికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన నీటి ఎద్దడి అనే మాట ఎక్కడా విన్పించకూడదన్నారు. నగర,పట్టణ ప్రాంతాల్లో ఇది అవసరమన్నారు. ప్రతిపాఠశాలకు నీటి వసతి అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ సంస్థలు,కీలకంగా రెవెన్యూ, పోలీసు,స్థానిక సంస్థలు మంచినీటిని ప్రజలకు అందుబాటులో ఉండడానికి విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.వాటికి నీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధసంస్థల సహకారం తీసుకోవాల

>>2

సాయం అందించే చేతుల కోసం

# పి-4 పథకం రెడీ

## మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సంపన్నవర్గాల వారు పేదలకు సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం పీ4 విధానం ద్వారా ప్లాట్‌ఫామ్ నిర్మిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉగాది రోజున ప్రారంభించే జీరో పావర్టీ - పీ4 విధానంపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సాయం అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చని, ఎవరినీ ఇందుకోసం ఒత్తిడి చేయొద్దని అధికారులకు సూచించారు. ఎన్నారైలు కూడా పీ4లో భాగస్వాములు కావొచ్చని, గతంలో తన హయాంలో చేపట్టిన జన్మభూమి తరహాలోనే పీ4 కార్యక్రమానికి కూడా ప్రజాదరణ వస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. పేదలకు మద్దతుగా నిలిచేందుగా స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. పీ4 విధానంలో ప్రభుత్వ పాత్ర కేవలం ఇరువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమేనని, ప్రభుత్వం తరపున ఎవరికీ అదనపు సాయం ఉండదని చెప్పారు. ఉన్నతవర్గాల వాళ్లు సాయానికి ముందుకొచ్చేలా వారిలో స్ఫూర్తి నింపాలని ముఖ్యమంత్రి అన్నారు. లబ్ధి పొందేవారిని బంగారు కుటుంబంగా, సాయం చేసే వారిని మార్గదర్శిగా పిలవాలని సూచించారు. బంగారు కుటుంబానికి ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని చెప్పారు. గ్రామసభ, వార్డు సభలు నిర్వహించడం ద్వారా తుది జాబితా రూపొందిస్తే వివాదరహితంగా ఉంటుందని అన్నారు. పీ4 కార్యక్రమానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఎటువంటి సంబంధం లేదని సీఎం అన్నారు. పీ4 కార్యక్రమం అనేది సమాజంలో అత్యంత వెనకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు చేపట్టిన కార్యక్రమం అని అన్నారు. పీ4, ప్రభుత్వ పథకాల అమలుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు అధికారులు తావివ్వకూడదని తెలిపారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే పీ4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒకరైనా హాజరయ్యేలా, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పేదరిక నిర్మూలన జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యం చేరే వరకు పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. పీ4 తో సంపద సృష్టిస్తాం. పేదరికం నిర్మూలిస్తాం. సంపద కొందరికే పరిమితం అవడంతో పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్న 73 కార్యక్రమాలు రూ. 10 వేల కోట్లతో జరుగుతున్నాయి. సర్వే రాళ్లపై రూ. 650 కోట్లు ఖర్చు చేశారు. వాటిపై బొమ్మలు వేసుకున్నారు. ఆ బొమ్మలు తీయడానికి రూ.30కోట్లు ఖర్చయింది. మన రాష్ట్రం 2047 నాటికి స్వర్ణాంధ్ర విజన్ సైద్దాంతిక పత్రానికి అనుగుణంగా విజయాలు సాధించాలన్నారు.కలసి అందరం పనిచేద్దాం,మన రాష్ట్రాన్ని సుసంపన్నం చేసుకుందామన్నారు.

# ఆపరేషన్ మోడల్‌లో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్వహణ

## సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 24,ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు ఆర్థిక భారం పడకుండా ఆపరేషన్ మోడల్‌లో నిర్వహించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.ఈ ప్రాజెక్టు విషయంలో వెనక్కు తగ్గేది లేదన్నారు. గోదావరి జలాలను పోలవరం నుంచి లిఫ్టుల ద్వారా తరలించేందుకు అయ్యే విద్యుత్ వినియోగాన్ని ప్రాజెక్టు ప్రాంతంలోనే పంప్డ్ స్టోరేజ్, సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పడం ద్వారా ఉత్పత్తి చేసి భారం తగ్గించవచ్చని చెప్పారు. దీనిపై

>>2

# టిటిడి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ



## విఐపి బ్రేక్ దర్శనాలు మళ్లీ పాతసమయంలోనే: చైర్మన్ బిఆర్ నాయుడు

**తిరుమల,మార్చి 24ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా దాతలు,భక్తులు ఇచ్చిన విలువైన స్థలాలు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని, ఈ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ నియమిస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. శ్రీవారి ఆస్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో ఇప్పటికీ ఫెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. టిటిడిలో అన్యమత ఉద్యోగులను తొలగిస్తామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనేగాక ఇతర దేశాల్లో కూడా ఏడుకొండల వెంకన్న ఆలయాలు నిర్మిస్తామని, ఇప్పటికే పలువురు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలయ నిర్మాణాలకు ఆమోదం తెలిపారని చెప్పారు. ఏడాదిన్నర కాలంలో ఆలయాలు నిర్మాణాలు చేయాలని బోర్డు సంకల్పించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల ఆగిన దేవాలయాల పనులను చేపట్టి పునః నిర్మించేందుకు ఈ సమావేశంలో నిర్ణయించామని ఆయన తెలిపారు. తిరుమల అన్నమయ్య

>>2

# గుంటూరు సిఐడి ఆఫీసుకు పోసాని

**విజయవాడ,మార్చి 24,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళి గుంటూరు సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. ఏపి సిఎం చంద్రబాబును దూషించిన కేసులో బెయిలు మంజూరు చేసే క్రమంలో వారంలో రెండు రోజులు సిఐడి కార్యాలయంకు పోసాని హాజరుకావాలని గుంటూరు న్యాయస్థానం షరతు విధించింది. అందులో భాగంగానే సోమవారం,గురువారం గుంటూరు సిఐడి కార్యాలయంలో సంతకం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సిఐడి కార్యాలయానికి ఆయన హాజరయ్యారు.

# జల సంరక్షణకు 'పల్లె పుష్కరిణి'

**విజయవాడ, మార్చి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షపునీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు పల్లెపుష్కరిణి పేరుతో చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జలసంరక్షణ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. మండలానికి ఒకటి నుంచి రెండు చొప్పున మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 660 చెరువులకు పూర్వ వైభవం తీసుకురానుంది. వీటిని ప్రజలకు ఆహ్లాదాన్ని ఆరోగ్యాన్ని అందించే ఉద్యాన వనాలుగానూ అభివృద్ధి చేయనుంది. జలసంరక్షణలో అత్యంత ప్రాధాన్యంగల చెరువుల నిర్వహణపై పంచాయతీల నిర్లక్ష్యం కారణంగా అనేకచోట్ల వాటి రూపురేఖలు మారిపోయాయి. 2025-26 ఆర్థిక సం వత్సరంలో ఇలాంటి చెరువులను గుర్తించి ఉపాధి పథకంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది.ఇందుకోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి విడుదల చేసింది. చెరువులను ఈ నెల 31లోగా అధికారులు ఎంపికచేసి ఏప్రిల్ 7న గ్రామ సభల్లో ఆమోదం తీసుకోవాలని. జూన్ 30లోగా 660చెరువుల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి. వర్షాకాలంలో చెరువుల్లో చేరిన నీటిని సం రక్షిం చాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.





సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభిస్తున్న కేంద్రమంత్రులు రామ్మోహన్, పీయూష్, ఓరమ్, రిజిజు

# పార్లమెంటు వద్ద అరకు కాఫీ స్టాల్

## సిఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి హర్షం

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటు ప్రాంగణంలో ఏపీ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు అయ్యాయి. ఈ కేంద్రాలు ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మనకీ బాత్‌లో అరకు కాఫీని ప్రోత్సహించినందుకు ప్రధాని మోదీకి, పార్లమెంట్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సీఎం చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మైలురాయిని నిజం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇది మనందరికీ, ముఖ్యంగా మన గిరిజన రైతులకు గర్వకారణమని సీఎం వ్యాఖ్యానించారు. వారి అంకితభావం, కృషి అరకు కాఫీని జాతీయ స్థాయిలో అత్యున్నత స్థాయికి తీసుకువచ్చాయని పేర్కొన్నారు. ప్రతి కప్పును ఆస్వాదిస్తున్నప్పుడు, వారి స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని కూడా గుర్తుంచుకుందామని సీఎం పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో మన అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభించడానికి ప్రోత్సహించిన సీఎం చంద్రబాబుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కృతజ్ఞతలు చెప్పారు. లోక్‌సభ, రాజ్యసభలో 2 కాఫీ స్టాల్స్ కేంద్రమంత్రులు రామ్మోహన్, పీయూష్, ఓరమ్, రిజిజులు ప్రారంభించారు. అరకు కాఫీ పార్లమెంటులో తన స్థానాన్ని సంపాదించుకోవడం చూసి చాలా ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఈ ఆర్గానిక్ కాఫీ లక్షలాది మంది గిరిజన రైతుల అంకితభావానికి వారి గొప్ప వారసత్వానికి నిదర్శనమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీని ప్రోత్సహించడంలో, జీఐ ట్యాగ్‌ను పొందడం, గిరిజన రైతులకు మద్దతు ఇవ్వడం, ప్రపంచ వేదికలపై ప్రదర్శించడంలో కీలకంగా ఉన్న దార్శనిక నాయకుడు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పారు. పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్‌కు కృషి చేసిన స్పీకర్ ఓం బిర్లా, ఇతర కేంద్రమంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వీరి మద్దతు గిరిజన సమాజాలను ఉద్ధరించి భారతదేశ సేంద్రీయ వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా తీసుకువెళుతుందని పేర్కొన్నారు.

**గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి హర్షం:** పార్లమెంటులో అరకు కాఫీ స్టాళ్ల ఏర్పాటుపై గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. స్టాళ్ల ఏర్పాటును ప్రోత్సహించిన సీఎం చంద్రబాబుకు అలానే లోక్‌సభ, రాజ్యసభలో కాఫీ స్టాళ్లను ప్రారంభించిన కేంద్రమంత్రులు రామ్మోహన్, పీయూష్, ఓరమ్, రిజిజుకు మంత్రి సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నిర్వహణ

>> సోమవారం సాయంత్రం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్షను నిర్వహించారు. ఈ అనుసంధానానికి సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఈ ఏడాది జూన్ 20 నాటికి పూర్తి చేయాలని, ఇదే ఏడాది అక్టోబర్ 20 కల్లా ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ ఆమోదం పొందేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పర్యావరణ అనుమతులు కూడా పొంది, త్వరగా పనులు ప్రారంభించాలని చెప్పారు. పోలవరం- బనకచర్ల అనుసంధానానికి మొత్తం రూ.81,900 కోట్లు ఖర్చుకానుంది. ఈ అనుసంధానం ద్వారా రోజుకు 2 టీఎంసీలు డిశ్చార్జ్ అవుతుంది. 368.60 కి.మీ ఓపెన్ కెనాల్ ద్వారా నీరు తరలిస్తారు. మెయిన్ టన్నెల్ 20.50 కి.మీ ఉండగా, సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ 6.60 కి.మీ., పైపులైను 17 కి.మీ. వరకు నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తం 9 లిఫ్ట్‌లు వినియోగిస్తారు. 3,377మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు 15,300ఎకరాల అటవీ భూమితో కలిపి మొత్తం 54,000 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. అలాగే బొల్లాపల్లి రిజర్వాయర్ కోసం 5 గ్రామాల్లో 18 నివాసప్రాంతాల వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. ఈ అనుసంధాన ప్రక్రియను ప్రభుత్వం మొత్తం 3 సెగ్మెంట్లుగా చేపట్టనుంది.



జిఎన్‌యు వ్యవస్థాపకుడు, రెక్టార్ డాక్టర్ గియా కావ్టెలిష్విలి, విద్యావ్యవహారాల వైస్ రెక్టార్ ప్రొఫెసర్ జార్జ్ గవ్రాడ్జే, అడ్మినిస్ట్రేటివ్ ఎఫైర్స్ వైస్ రెక్టార్ డాక్టర్ గొడెర్జి బుచాష్విలి తదితరులతో మంత్రి నారా లోకేష్

# ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ వర్సిటీ

## జార్జియా నేషనల్ వర్సిటీతో ఒప్పందం

## రూ.1,300 కోట్లు పెట్టుబడికి జిఎన్‌యు రెడీ

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరాంధ్రలో విద్యావ్యవస్థను అత్యంత పటిష్టం చేయనున్నట్లు ఏపీ మానవవనరులు,విద్యా,ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు.అంతర్జాతీయ ప్రమాణాలతో ఇక్కడ విద్యాసంస్థలు రానున్నాయన్నారు.జార్జియా నేషనల్ యూనివర్సిటీ (జీఎన్‌యూ)ని ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అందించే ఆశయంతో ఉత్తరాంధ్ర లో ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ (జీఎన్‌యూ) ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ శీనిగే (బివిగే)తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో జీఎన్‌యు, ఎపి ప్రభుత్వ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం ఉత్తరాంధ్రలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్థాపించడానికి బివిగే సుమారు రూ.1,300 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ఈ ఒప్పందంతో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందడంతోపాటు 500మందికి ఉపాధి లభిస్తుంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ స్థాపనకు మద్దతుగా పెట్టుబడి, సాంకేతికత, ప్రణాళిక రూపకల్పన, ఎక్విప్ మెంట్ లలో బివిగే బలాలను ఉపయోగించుకోవడం ఈ సహకారం లక్ష్యం. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ జార్జియన్ నేషనల్ యూనివర్సిటీతో ఈ ఒప్పందం మన విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడంతోపాటు ఏపీ విద్యారంగాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు దోహదపడుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్నతవిద్య ప్రమాణాలను మెరుగుపర్చడం, గ్లోబల్ ఎక్స్ పోజర్, పాఠ్యాంశాలను మెరుగుపర్చడం, అధునాతన విద్య, సాంకేతికలను అందించడం, పరిశోధన, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఒప్పందం ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రోగ్రామ్ లలో ముఖ్యంగా టెక్నాలజీ, బిజినెస్, ఆరోగ్య హెల్త్ కేర్ లలో జీఎన్ యు నైపుణ్యాలను అందిస్తుంది. అధ్యాపకులు, విద్యార్థుల నడుమ నాలెడ్జి షేరింగ్ ను సులభతరం చేయడం, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ప్రపంచ విద్యా వ్యవస్థల అభ్యసన విధానాలపై అవగాహన కల్పిస్తుంది. రాష్ట్రంలో సాంకేతిక విద్య, పారిశ్రామిక పురోగతికి దోహదం పడుతుంది. లీగ వంటి ప్రపంచస్థాయి సంస్థలతో బివిగే సంబంధాలు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమ డిమాండ్లకు అనుగుణంగా నైపుణ్యాలు, అర్హతలతో కూడిన విద్యార్థులను సన్నద్ధం చేసి జాతీయ, అంతర్జాతీయస్థాయి ఉపాధి అవకాశాలకు ఊతమిస్తుంది. 2002లో స్థాపించబడిన జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ శీనిగే జార్జియాలో అతిపెద్ద యూనివర్సిటీగా అవతరించడమేగాక, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న డైనమిక్ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఉంది. 1,100 మందికి నైపుణ్యం కలిగిన అధ్యాపక సిబ్బందిని కలిగి ఉన్న ఈ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన సుమారు 52,500 మంది పూర్వవిద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వివిధరంగాల్లో స్థిరపడ్డారు. జీఎన్ యు ప్రపంచవ్యాప్తంగా పేరొందిన 4 ఇంటర్నేషనల్ అక్రిడిటేడెట్ ఫ్యాకల్టీ ప్రోగ్రామ్స్ తోపాటు పలు అగ్రశ్రేణి గ్లోబల్ కంపెనీల కొలాబరేషన్ కలిగి ఉంది. ఫండింగ్ తో కూడిన ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్ లను కూడా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో జీఎన్ యు వ్యవస్థాపకుడు, రెక్టార్ డాక్టర్ గియా కావ్టెలిష్విలి, విద్యావ్యవహారాల వైస్ రెక్టార్ ప్రొఫెసర్ జార్జ్ గవ్రాడ్జే, అడ్మినిస్ట్రేటివ్ ఎఫైర్స్ వైస్ రెక్టార్ డాక్టర్ గొడెర్జి బుచాష్విలి, ఫైనాన్స్ అండ్ రిసోర్సెస్ వైస్ రెక్టార్ లెవాన్ కలందరిష్విలి, ఇండియా ఆపరేషన్స్ అండ్ అడ్మిషన్స్ డైరక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి, ఆత్మీయ ఎడ్యుకేషన్ ఫౌండర్, ఛైర్మన్ హష్మిక్ వాఘేలా, సిఇఓ చిరాగ్ వాఘేలా, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ భరత్ గుప్త, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి రానివ్వొద్దు

>> న్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్మెంట్, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎండల తీవ్రతపై ముందుగా వివిధ విభాగాల నుంచి సమాచారం తెప్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులకు సీఎం సూచించారు. ఎండ వేడిమి సమాచారాన్ని మొబైల్ అలెర్ట్స్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియజేసి, వారు ఎండలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ముందస్తు జాగ్రత్తల ద్వారా వడదెబ్బ మరణాలు నివారించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, కూలీ అడ్డాలు, ఇతర జన సమూహం ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వ శాఖల పరంగా సహకారం అందించాలని సూచించారు. 2014- 19 మధ్య కూడా ప్రజలకు ఉచితంగా ప్రభుత్వం తరుపున మజ్జిగ అందించామన్నారు. ఈసారి కూడా ఎండలు తీవ్రంగా ఉండే ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాలో పశుగ్రాసం కొరతతో పాటు పశువులకు తాగునీరు లభించని పరిస్థితి ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పశువులకు నీరు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రూ.35 కోట్లతో 12,138 నీటితొట్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మనసున్న ప్రభుత్వం అనేది గుర్తెరిగి అధికారులు తమ ఆలోచనలను అమలు చేయాలని సీఎం అన్నారు. వేసవిలో పశువులు, పక్షుల దాహాన్ని తీర్చుకోడానికి ఇబ్బందులు పడకుండా సాధ్యమైనంత వరకు నీటి సదుపాయం కల్పించాలని అన్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని, తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు, కార్చిచ్చులపై అప్రమత్తంగా ఉండాలని, డ్రోన్లతో పర్యవేక్షించాలని సూచించారు. ఎవరైనా బాధ్యతా రాహిత్యంగా కార్చిచ్చుకు కారణం అయినట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన రూ.39 కోట్లు విడుదలకు కూడా సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నీటి లభ్యత పెంచేందుకు గ్రామాల్లో నరేగా ద్వారా ఫాం పాండ్స్ నిర్మాణం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అదే విధంగా వేసవిలో నరేగా కూలీలకు అదనపు పనిదినాలు మంజూరు చేయడంతో పాటు, వారికి పని ప్రాంతంలో నీళ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు ఉపాధి హామీ కూలీలు పనులు ముగించుకుని ఇంటికి చేరుకునేలా చూడాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు బయట ప్రాంతాల్లో పని అప్పగించకుండా చూడాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో బెడ్లు, వైద్యులు, వడదెబ్బకు ట్రీట్మెంట్ అందించే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటి నుంచే దోమల నివారణ చర్యలు చేపట్టాలని...తద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలు వ్యాధుల భారినపడకుండా చూడాలన్నారు.ఎండలు తీవ్రంగా ఉంటాయని ప్రకృతి విపత్తుల నియంత్రణ యంత్రాంగం హెచ్చరిస్తోంది.ఈ సంస్థ సమాచారం ప్రజలకు అందించాలి.వారు ఎండలో బయటకు రాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టిటిడి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

>> భవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన పాలకమండలి సమావేశం సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు సుదీర్ఘంగా జరిగింది. ఈ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు మీడియాప్రతినిధులకు వెల్లడించారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగురోజుల ముందు తిరుమల పర్యటనలో గోవిందుని దర్శనానికి విచ్చేసిన సమయంలో పలుప్రధాన అంశాలపై స్పష్టత ఇచ్చారన్నారు.ఆయన సూచనల మేరకు వాటిపై సోమవారం జరిగిన పాలకమండలిల సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు.తిరుపతి అలిపిరి సమీపంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి వేరేచోట భూమిని కేటాయించాలని సిఎం ఆదేశించారన్నారు. అలిపిరి వద్ద ఉన్న 35.24 ఎకరాలతోబాటు 15 ఎకరాల టూరిజం భూమిని కూడా టిటిడి స్వాధీనం చేసుకుంటుందన్నారు. సైన్స్‌సిటీకి కేటాయించిన 20 ఎకరాల స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకపోవడంతో తిరిగి స్వాధీనం చేసుకోనున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా టిటిడి పరిధిలోని ఏడుకొండలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు చేపట్టకుండా నిర్దిష్టమైన కార్యాచరణ అమలుచేస్తామన్నారు. టిటిడికి చెందిన స్థలాల్లో అలిపిరి ఆనుకునిఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ విభాగాలకు కేటాయించిన భూములను స్వాదీనం చేసుకుని, ప్రత్యామ్నాయం చూపేలా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. టిటిడి ఆస్తుల్లో ఒక్కఅంగుళం కూడా ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ నాయుడు తేల్చిచెప్పారు.

**పోటుకార్మికులపై జిఎస్టీభారం తొలగించాం: ఐదుగురితో నూతన ఆగమసలహామండలి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పవిత్రమైన అన్నప్రసాదాలు, లడ్డూలు, వడలు తయారుచేస్తున్న పోటు కార్మికులకు చెల్లిస్తున్న 43వేల రూపాయలు వేతనంలో కట్‌చేస్తున్న జీఎస్‌టి భారాన్ని టిటిడి చెల్లించేలా చూస్తామన్నారు. టిటిడి ఉద్యోగులకు మూడునెలల ఒక్కసారి సుపథం ద్వారా దర్శనం కల్పిస్తామని ఇఒ తెలిపారు. టిటిడి ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జ్‌పై అధ్యయనం చేశామని, అమలుచేయడానికి చూస్తామన్నారు. టిటిడి పాత ఆగమసలహామండలి రద్దుచేశామని, నూతన ఆగమసలహామండలిని ఐదుగురు ఆగమపండితులతో కమిటీని నియమించనున్నామని ఇఒ శ్యామలరావు చెప్పారు. ప్రస్తుతం ఉదయం 8గంటలకు, ఉదయం 10గంటలకు ఇలా అమలవుతున్న విఐపి బ్రేక్ దర్శనాల సమయాన్ని రద్దుచేసి, ఈ దర్శనాలను ఇకనుండి ఉదయం 5.30గంటలకే ప్రారంభించాలని సూచించడం జరిగిందన్నారు. ఇది ప్రయోగాత్మకంగా ట్రయల్‌రన్ చూసి ఆ తరువాత పూర్తిస్థాయిలో అమలుచేసేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి గంగమ్మ, తలకోన, కర్నూల్ జిల్లాలోని బుగ్గ, అనకాపల్లిలోని ఉపమాక, ధర్మవరం, తెలంగాణాలోని కొడంగల్,సికింద్రాబాద్, కరీంనగర్‌లలో నూతనంగా ఆలయాలు నిర్మిస్తున్నామని ఇఒ ప్రకటించారు. టిటిడి విద్యాసంస్థల్లో 180మంది కాంట్రాక్టు అధ్యాపకుల జీతభత్యాల పెంపుపై కమిటీ వేశామని చెప్పారు. దివ్యాంగులు, వృద్ధుల ప్రత్యేక దర్శనాల టిక్కెట్స్ ఆఫ్‌లైన్‌లో జారీచేసేందుకు కమిటీని వేశామని,అధ్యయనం తరువాత తెలియజేస్తామన్నారు.ఈ సమావేశంలో టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా, నర్సిరెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వరరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో ఇక అర్ధరాత్రి 12 గంటల దాకా రెస్టారెంట్లు, హోటళ్లు

**విజయవాడ.మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోఅతిపెద్దనగరాల్లో ఒక్కటి,రాజధాని పరిధిలోని విజయవాడలో ఇకపై అర్ధరాత్రి 12 గంటల వరకూ ఇక నుంచి అన్ని రెస్టారెంట్లు, హోటళ్లు తెరిచి ఉండబోతున్నాయి.ఇది ఒక రకంగా రాష్ట్రమంతటికి ఉపయుక్తం కానున్నది.నిత్యరద్దీగా ఉండే విజయవాడకు ఇది మంచి సదుపాయంగా మారింది. నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ మేరకు పోలీసులు అనుమతి ఇచ్చారు. ఆదివారం రాత్రి నుంచే ఇవి అమల్లోకి వచ్చేశాయి. 2018లోనే చంద్రబాబు సర్కారు హోటళ్లను అర్ధరాత్రి వరకూ ఉంచేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.తాజాగా వాటిని అమలు చేస్తూ విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. తొలి మూడు నెలలు ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు.12 గంటల వరకూ హోటల్స్, రెస్టారెంట్లు: విజయవాడ నగరానికి రైళ్లు, బస్సుల్లో రాత్రి 10 గంటలు దాటిన తర్వాత వచ్చేవారు వేల సంఖ్యలో ఉంటారు. నగరంలోని రాత్రి 9.30 సమయమైన తర్వాత అన్నిహోటళ్లు మూతపడుతున్నాయి. ఆహారం కావాలంటే నగరంలో అర్ధరాత్రి వరకూ ఉండే ఫుడ్ కోర్టులను వెతుక్కుంటూ వెళ్తున్నారు. అందువల్ల నగరంలో జనసంచారం గత పదేళ్ల కాలంలో రాత్రి సమయాల్లో విపరీతంగా పెరిగింది. రాత్రి వేళ విధులు నిర్వహించే వారు పెరిగారు.

**సానుకూలంగా స్పందించిన కమిషనర్:** ఏ పన్నూ చెల్లించని వారికి అర్ధరాత్రి వరకూ అనుమతి ఇస్తున్నప్పుడు, ప్రభుత్వానికి 13రకాల పన్నులు చెల్లిస్తున్న తమకు కూడా అనుమతి ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరడం సత్ఫలితం ఇచ్చింది. ఇదే విషయాన్ని రెండు రోజుల కిందట విజయవాడలో హోటళ్ల అసోసియేషన్‌తో నిర్వహించిన సమావేశంలోనూ కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలోనే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర సంఘం పరిధిలో 144 రెస్టారెంట్లు, 46హోటళ్లకు సభ్యత్వం ఉన్నాయి. అయితే సభ్యత్వం లేని వాటిని గమనించినట్లయితే చిన్నా పెద్ద హోటలన్నింటినీ కలుపుకుని 200కు పైగా ఉన్నాయి. పాత పద్ధతిలో హోటళ్లు, రెస్టారెంట్‌లు మూసివేయాల్సిన సమయం రాత్రి 10 గంటలకు కావడంతో 9.30కే సర్దుకోవాల్సి పరిస్థితి వస్తోంది. చెన్నై నుంచి పినాకినీ, హైదరాబాద్ నుంచి శాతవాహన, విశాఖనుంచి రత్నాచల్ సహా నవజీవన్ లాంటి రైళ్లన్నీ రాత్రి 9గంటల తర్వాతే విజయవాడకు వస్తాయి.బస్సుల్లో తెల్లవారుజాము వరకూ ప్రయాణికులు దిగుతూనే ఉంటారు. వీరికి బందరు రోడ్డులో ఈట్‌స్ట్రీట్, బీఆర్‌టీఎస్ రోడ్డులో సత్యనారాయణపురం వద్ద ఫుడ్‌కోర్టులు తప్ప మరో హోటల్ కనిపించదు. ప్రజల సౌకర్యంతోపాటు హోటళ్ల మనుగడ కోసం రాత్రి 12 గంటల వరకూ తెరిచి ఉంచా లంటూ తాము చాలాకాలంగా కోరుతున్నామని రాష్ట్రహోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి. స్వామి, విజయవాడ అధ్యక్షులురమణ, కోశాధికారి మల్లిఖార్జున్ పేర్కొన్నారు.విశాఖలో ఈ ప్రక్రియ విజయ వంతంగా సాగుతోందని,అదేవిధంగా ఇక్కడసైతం తమప్రయత్నం ఫలించినందుకు ఆనందంగా ఉందన్నారు.

# అభిషేక్ మొహంతికి హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** కరీంనగర్ మాజీ పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతికి హైకోర్టులో ఊరట లభించింది. క్యాట్‌లో విచారణ పూర్తయ్యే వరకు తెలంగాణ నుంచి ఆయనను బదిలీ చేయవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి ఎపి కేడర్ 2011 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన అభిషేక్ మొహంతి రాష్ట్ర విభజన తరువాత ఎపికి కేటాయించపడ్డారు. కొంతకాలం అక్కడ పనిచేశాక క్యాట్‌ను ఆశ్రయించి నాలుగేళ్ల క్రితం తెలంగాణకు వచ్చారు. అయితే ఆయనను ఎపికి బదిలీ చేస్తూ ఇటీవల కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో ఆయన కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇదే సమయంలో ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో వుండడంతో ఆయన బదలీ తాత్కాలికంగా ఆగింది.





బిల్లుల కోసం రోడ్లను ఊడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

# కాంట్రాక్టర్ల వినూత్న నిరసన

**విజయనగరం, మార్చి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాంధ్రాకు చెందిన కాంట్రాక్టర్లు వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాము చేసిన నిర్మాణ పనులకు సంబంధించిన బకాయిలను ఇప్పటి వరకూ చెల్లించలేదని వాపోయారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా తమ గోడు పట్టించుకుంటుందేమోనని ఆశపడ్డామని, అయితే తమ ఆశలన్నీ నిరాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా రోడ్ల మీద గుంతలు పూడ్చి కాలక్షేపం చేస్తోందే గానీ తమకు రావాల్సిన బకాయిల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని బిల్డర్స్ అసోసియేషన్, సబ్‌కాకు చెందిన కాంట్రాక్టర్లు విమర్శించారు. ఇరిగేషన్, పంచాయితీరాజ్, మున్సిపాల్టీ, రోడ్లు, భవనాలు, నాబార్డ్ తదితర శాఖలు, విభాగాల్లో తాము చేసిన నిర్మాణ పనులకు సంబంధించి కోట్లల్లో బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయని బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు కె.శ్రీనివాస రెడ్డి, సాగి శివాజీ, సబ్‌కా నేత ఎ.చిన్నంనాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ వాపోయారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుంచి కూడా అప్పులు తీసుకుని నిర్మాణ పనులు పూర్తి చేశామని తెలిపారు. కానీ యేళ్ల తరబడి తమ బకాయిలు పెండింగ్‌లో ఉండిపోవడంతో ఆయా బ్యాంకుల నుంచి, ఫైనాన్షియర్ల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నామని, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని పేర్కొన్నారు. కనీసం ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ ఇబ్బందులు, సమస్యలపై స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు.



రైల్వే జీఎం జైన్‌చే మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డును అందుకుంటున్న సిబ్బంది

# ప్రయాణికుల భద్రతే ప్రధానం

## మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే జీఎం జైన్

**గుంతకల్లు రైల్వే,మార్చి 24,ప్రభాతవార్త:** రైలు ప్రయాణికుల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కోరారు. రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయంలో సోమవారం జరిగిన భద్రతా, సమయపాలన, సమీక్ష సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, డిప్యూటీ జీఎం మల్లాది శ్రీనివాస్‌తో కలిసి జోన్‌లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలనా న్నరు. ఫిబ్రవరి, మేలో జోన్ పరిదిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా సమయస్ఫూర్తితో ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన గుంతకల్లు డివిజన్‌లోని నిడిగల్లులో సహాయ పాయింట్స్‌మెన్‌గా పనిచేస్తున్న జి రావత్ ఆదోనిలో ఎస్ఎంగా పనిచేస్తున్న ఆర్‌కె ఘూ, నందలూరులో ట్రైన్ మేనేజర్‌గా పనిచేస్తున్న గంగాధర్, గుంతకల్లు సిఅండ్‌డబ్ల్యూడిపోలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తు ఎస్ఆర్ జయరాములుతో పాటు సికింద్రాబాద్, విజయవాడ డివిజన్‌లలో మూడేసి చొప్పున హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌లలో రెండేసి చొప్పున మొత్తం 14మంది రైల్వే సిబ్బందికి జీఎం జైన్ మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకట రమణారెడ్డి, జోన్‌కు చెందిన ఆయా కీలక విభాగాలకు చెందిన ప్రధాన అధికారులతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్ ఎంలు, డివిజన్‌లకు చెందిన సంబంధిత ఉన్న తాధికారులు, సీనియర్ సబార్డినేట్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌పై 3156 ఫిర్యాదులు

## రెండేళ్లలోనే 51 మంది మృతి

**న్యూఢిల్లీ, మార్చి 24:** యూనివర్సిటీలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును ర్యాగింగ్ చిదిమేస్తోంది. 2022-24 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 50కిపైగా ర్యాగింగ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయి. ముఖ్యంగా వైద్యకళాశాలల్లో ఈతరహా కేసులు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. స్టేట్ ఆఫ్ ర్యాగింగ్ ఇన్ ఇండియా 2022-24 పేరిట సొసైటీ అగెనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ సంస్థ రూపొందించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడి అయ్యాయి. రెండేళ్లకాలంలోనే జాతీయ ర్యాగింగ్ నిరోధక హెల్ప్‌లైన్‌కు 1946 కళాశాలలనుంచి 3156 ఫిర్యాదులు అందాయి. ఈ ర్యాగింగ్ రక్కసికి 51 మంది చనిపోయారు. ఒక్క 2024 లోనే 20 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజస్థాన్‌లోని కోచింగ్‌కేంద్రాలకు పేరుపొందిన కోటాలో ఇదే వ్యవధిలో నమోదైన 57 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు చేరువలో ఈసంఖ్య ఉంది. హెల్ప్‌లైన్‌లో నమోదయిన మొత్తం ఫిర్యాదుల్లో 38.6శాతం, తీవ్రమైన ఫిర్యాదుల్లో 35.4శాతం,మరణాల్లో 45.1 శాతం వైద్యకళాశాలలకు సంబంధించినవే. మెడికల్‌కాలేజీలు ర్యాగింగ్‌కు హాట్‌స్పాట్‌లుగా ఉన్నట్లు నివేదికలో పొందుపరిచింది. నివేదికలో ప్రస్తావించిన గణాంకాలకంటే ఫిర్యాదులు చాలా ఎక్కువ ఉంటాయని కూడా అంచనా వేసింది. మూడేళ్లలో దేశంలో మూడువేలకుపైగా ఘటనలే జరిగాయని చెప్పలేమని, హెల్ప్‌లైన్‌లో నమోదయిన ఫిర్యాదులసంఖ్య మాత్రమే పొందుపరిచామన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 25-03-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
ఏకాదశి రా.3.47
శ్రవణం రా.3.49
వర్జ్యం ఉ.8.20-9.53
దు.ఉ.8.43-9.32, 2) రా.11.19-12.08
శుభసమయం: ఉ.4.30-5.15
మ.2.15-3.00
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం:** మిత్రులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**వృషభం:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**మిథునం:** ఆర్థిక లావాదేవిలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి చెందుతాయి.

**సింహం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. సోదరుల నుండి సాయం అందుకుంటారు.

**కన్య :** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలుగుతుంది. ఖర్చులు పెరుగుతాయి.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు తీరి ఊరట చెందుతారు. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**ధనుస్సు:** అనుకోని అవకాశాలు లభిస్తాయి.వాటిని సద్వినియోగం చేసుకోండి.వస్తువులు కొనుగోలు చేస్తారు.

**మకరం:** సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** రుణవత్తిడులు ఎదురైన నిదానంగా తీరుస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

25-03Pg3exHMNWJQELSBTCGKP.qxd:25-03Pg3exHMNWJQELSBTCGKP.qxd 25/03/25 12:37 AM Page 1





జాతీయ టేబుల్ టెన్నిస్‌లో పతకాలు సాధించిన ఉద్యోగినులు సహదేవ సత్యవతి,మద్దా బేబి సరోజినిని అభినందిస్తున్న సిఎస్

## జాతీయ టేబుల్ టెన్నిస్‌లో పతకాలు సాధించిన ఉద్యోగినులకు సిఎస్ అభినందనలు

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొన్నరాష్ట్ర సచివాలయ ఉద్యోగులు కాంస్య పథకాలు సాధించడం పట్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అభినందనలు తెలిపారు. ఈమేరకు కాంస్య పథకాలు సాధించిన మైనార్టీ సంక్షేమ శాఖలో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న మద్దా బేబి సరోజిని,జిఏడిలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న సహదేవ సత్యవతిలు సోమవారం రాష్ట్ర సచివాలయంలో వారు సాధించిన కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను సిఎస్ కు చూపించారు. ఈసందర్బంగా సిఎస్ విజయానంద్ ఇద్దరు క్రీడా కారులను ప్రత్యేకంగా అభినందిస్తూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించి వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# వైద్యం, న్యాయవృత్తులు విశ్వాసంపై నిలబడ్డాయి

## సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ

### పిఇఎస్ వైద్య కళాశాలలో ఘనంగా 17వ స్నాతకోత్సవం!

**కుప్పం, మార్చి 24 ప్రభాతవార్త** వైద్యం, న్యాయ వృత్తులు విశ్వాసంపై నిలబడినవని సుప్రీంకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ పేర్కొన్నారు. సోమవారం కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో జరిగిన 17వ స్నాతకోత్సవం కార్యక్రమంకు జస్టిస్ ఎన్.వి. రమణ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. వైద్య వృత్తి సేవాధర్మంతో కూడుకుందన్నారు. మనుషుల జీవన గమ్యాలను మార్చగల శక్తి వైద్య వృత్తిలో ఉందని ఆయన పేర్కొన్నారు. న్యాయ, వైద్య వృత్తుల మధ్య ఉన్న సమాంతర గుణాల గురించి వివరించారు. యువ వైద్యులు ప్రజాస్వామ్య ఆరోగ్య విధానాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. పిఇఎస్ మెడికల్ డైరెక్టర్ డా॥ సురేష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పిఇఎస్ వైద్య కళాశాల స్థాపనార్థక లక్ష్యాలను వివరించారు. పిఇఎస్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో వారి ప్రతిభను ప్రశంసించారు. మాజీ మెడికల్ సూపరింటిండెంట్ డా॥ ఎల్. కృష్ణ మాట్లాడుతూ పిఇఎస్ వైద్యకళాశాల అభివృద్ధి, విద్యార్థుల కృషిని కొనియాడారు. ఇన్‌చార్జ్ డీన్, ప్రిన్సిపాల్ డా॥ సుబ్బారావు ర్యాలీ స్వాగతోపన్యాసం చేశారు. ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన డా॥ విజయ్‌కుమార్‌ను స్వర్ణపతకంతో ఈసందర్భంగా సత్కరించారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన 145మంది, పిజి కోర్సు పూర్తి చేసిన 84మంది వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశ్వారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కుప్పం పిఇఎస్ వైద్యకళాశాల స్నాతకోత్సవంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న విశ్రాంత సిజెఐ ఎన్.వి. రమణ



# ఆదాయంపైనే అందరి దృష్టి

**ఖర్చుల తగ్గింపునకు మార్గాలు**

**రూ.5,258.68కోట్లతో పద్దు**

**- గత ఏడాదికంటే రూ.78.83కోట్లు అదనం**

**2025-26 టిటిడి వార్షిక బడ్జెట్ ఆమోదం**

**తిరుమల,మార్చి 24ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి,టిటిడి అధికారులు ఆదాయం పెంచుకునే దిశగా అడుగులేశారు. పలు రకాలుగా చేస్తున్న ఖర్చులు తగ్గించుకునే విషయంలో కూటమి ఆధ్వర్యంలోని టిటిడి పాలకమండలి తొలి బడ్జెట్‌లోనే మంచి ఆలోచనతో నిర్ణయాలు తీసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టిటిడి వార్షిక బడ్జెట్‌ను 5,258.68కోట్ల రూపాయల అంచనాతో రూపొందించి ఆమోదించారు. గత ఏడాది వార్షిక బడ్జెట్ కంటే ఈ ఏడాది 78.83కోట్ల రూపాయలు ఆదాయం అదనంగా సమకూర్చుకునే దిశగా తయారుచేశారు. ఇందులో వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీ కి సమర్పించుకునే కానుకల ద్వారా 1,729 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. గత బడ్జెట్‌కంటే ఈ బడ్జెట్‌లో 58కోట్ల రూపాయలు అదనంగా హుండీ ఆదాయం రావచ్చని భావించారు. గత ఏడాది బడ్జెట్‌లో హుండీ కానుకల ద్వారా 1,611కోట్ల రూపాయలు అంచనా వేయగా దానికంటే అదనంగా 60కోట్ల రూపాయలు ఆదాయంతో 1,671కోట్ల రూపాయలు సమకూరింది. వెంకన్నకు సంబంధించిన బంగారు ఆభరణాలు, నగదు వివిధ బ్యాంకుల్లో చేసిన డిపాజిట్‌ల పై వడ్డీరూపంలో 1,310 కోట్లు రూపాయలు ఆదాయం లభిస్తుంది. గత ఏడాది బడ్జెట్‌కంటే (రూ.1,253కోట్లు)67కోట్లు రూపాయలు అదనంగా వడ్డీరూపంలో ఆదాయం చేకూరుతుంది. తిరుమలేశుని లడ్డూలు, వడలు, ఇతరత్రా ప్రసాదాల విక్రయాలు ద్వారా 600కోట్లు రూపాయలు ఆదాయం చేకూరుతుంది. గత ఏడాది బడ్జెట్‌కంటే ఈ ఏడాది 50కోట్లు రూపాయలు అదనంగానే అంచనా వేశారు. విఐపి బ్రేక్ దర్శనాలు, ఎస్ఇడి దర్శనాలు(రూ.300)టిక్కెట్ల ద్వారా 310కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందని పద్దు రూపొందించారు. గత ఏడాదికంటే 5కోట్ల రూపాయలు అదనంగానే చేకూరనుంది. టిటిడి ట్రస్టులద్వారా ఈ ఏడాది బడ్జెట్‌లో 90కోట్లు రూపాయలు ఆదాయం రావచ్చని అంచనా. గత ఏడాది కంటే 5కోట్లు అదనంగా సమకూరుతుందని భావించారు. ఉద్యోగుల రుణాలు, అడ్వాన్స్‌లు చెల్లింపులు, ఇఎండి, సెక్యూరిటీ డిపాజిట్‌లకు ఈ బడ్జెట్‌లో 76.38కోట్ల రూపాయలు అంచనా వేశారు. గత ఏడాదికంటే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు 47కోట్ల రూపాయలు తగ్గించారు. ఇవేగాక గదులు, కల్యాణమండపాల అద్దెల రూపంలో 157 కోట్లు రూపాయలు, తలనీలాల విక్రయాల ద్వారా 176.50కోట్లు ఆదాయం గడించవచ్చని అంచనాతో రూపొందించారు. సోమవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో టిటిడి అధికారులు రూపొందించిన 2025-26 వార్షిక బడ్జెట్ 5,258.68కోట్ల రూపాయల పద్దును బోర్డు సభ్యులు ఆమోదించారు. 2025-26 బడ్జెట్ తయారీ సమయానికి టిటిడి ఖాతాల్లో బ్యాంకుల్లో నిల్వ 488.90కోట్ల రూపాయలు ఉంది. గత ఏడాది బడ్జెట్‌లో 543.07కోట్ల రూపాయలు బ్యాంకుల్లో నిల్వఉన్నట్లు చూపారు. 2024-25 వార్షిక బడ్జెట్‌ను 5,141.74కోట్ల రూపాయలతో అంచనావేసి గత పాలకమండలి ఆమోదించగా అదనంగా 38.11కోట్లు ఆదాయం లభించింది. దీంతో గత ఏడాది బడ్జెట్‌ప్రతిపాదనలు సవరించడంతో 5,179.85కోట్లు చేకూరింది. 2023-24 సంవత్సరానికి వార్షిక బడ్జెట్ 4,411కోట్ల రూపాయలుగా అంచనా వేసిన అధికారులు రెట్టింపుస్థాయిలో 5,122.80కోట్లు రూపాయలు ఆదాయం గడించింది.

# భాషను బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తా: డి.సిఎంపవన్ కల్యాణ్

**విజయవాడ మార్చి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** త్రిభాషా విధానంలో హిందీని మాత్రమే నేర్చుకోవాలని ఎవరూ చెప్పలేదని భాషను బలవంతంగా రుద్దడాన్ని తానూ వ్యతిరకేస్తానని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఓ ప్రసార మాధ్యమానికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన త్రిభాషా విధానం, లోక్‌సభ నియోజకవర్గల పునర్విభజన సమకాలీన రాజకీయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. భాషా విధానం గురించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 20 తమిళ, 107 ఒరియా, 57 కన్నడ, 5 సంస్కృతం, 400 ఉర్దూ, 37 వేలకుపైగా తెలుగు మాధ్యమ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటి ఉద్దేశం మాతృభాషలో బేసిక్ ఫౌండేషన్ సులభంగా అర్థం చేసుకోవడమేనని పేర్కొన్నారు. హిందీ వల్ల తమిళానికి ముప్పు ఉందనే భావన తమిళనాడులో ఉందనే ప్రశ్నకు స్పందిస్తూ ఏ భాషనూ బలవంతంగా రుద్ద కూడదని, అలా జరిగితే తానే వ్యతిరేకిస్తానని తెలిపారు. తమిళం నేర్చుకోవాలని ఎవరూ తనను ఒత్తిడి చేయలేదని తానే నేర్చుకున్నానని వివరించారు. త్రిభాషా విధానంలో హిందీనే నేర్చుకోవాలని ఎవరూ చెప్పలేదని, అందులో ఐచ్ఛికాలు ఉన్నాయన్నారు. తాను త్రిభాషా విధానంలో



రూపొందినవాడినేనని, ఆంగ్లం, తెలుగు , హిందీ తెలుసన్నారు. ఇది తనకు లబ్ధి చేకూర్చిందన్నారు. హిందీని నేర్చుకుని తెలుగుకు తాను దూరంకాలేదని, ఇంకా దగ్గరయ్యానని తెలిపారు. ఎక్కడో ఉన్న బ్రిటిషువారి ఆంగ్లాన్ని నేర్చుకోవడానికి లేని భయం హిందీని నేర్చుకునేందుకు ఎందుకని ప్రశ్నించారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు భాషలు హిందీతో కనుమరుగయ్యాయనే వాదనను ఆయన కొట్టిపారేశారు. పలువురు డీఎంకే నేతలు హిందీ మాట్లాడుతున్నారని తెలిపారు. తమిళనాడు ఆంధ్రా నేతలు పలువురు హిందీ మాట్లాడుతున్నా బహిరంగంగా హిందీని వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. త్రిభాషా విధానాన్ని రుద్దడంగా చూడడంలేదని పలు భాషలు నేర్చుకునేందుకు అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. త్రిభాషా విధానం ఆంధ్రప్రదేశ్ కర్ణాటకలో సహజమన్నారు.

## అమరావతిలో ఉద్యోగుల భవన సముదాయాల పనులకు టెండర్లు

**విజయవాడ మార్చి 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఉద్యోగుల కోసం నిర్మించిన భవన సముదాయాల తుది పనులకు సీఆర్డీఏ ఆదివారం టెండర్లు ఆహ్వానించింది. ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 15వరకు టెండర్లు దాఖలు చేయవచ్చు. చివరి రోజునే టెండర్లను అధికారులు తెరవనున్నారు. సుమారు రూ.2022 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం నాలుగు టెండర్లు ఆహ్వానించారు. ఈ పనుల కోసం గత జనవరిలో టెండర్లు పిలవగా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఎస్+12 విధానంలో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్‌లుగా ప్రభుత్వ ఉద్యోగుల కోసం 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం వీటి నిర్మాణాన్ని మొదలుపెట్టింది. గెజిటెడ్ అధికారుల టైప్-1, 2, నాలుగో తరగతి, నాన్ గెజిటెడ్, గ్రూప్-డి ఉద్యోగుల కోసం నిర్మించిన భవన సముదాయాల్లో మిగిలి ఉన్న బిల్డింగ్ ఎలివేషన్, ప్లంబింగ్, శానిటరీ, విద్యుత్తు, అంతర్గత రోడ్లు, రంగులు, తాగునీరు, ఎస్‌టీపీలు, డ్రైనేజీలు, లిఫ్టులు , డీజిల్ జనరేటర్లు, పచ్చదనం పెంపొందించడం, భద్రతా పరికరాల అమరిక తదితర పనులకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు నిధులతో చేపట్టనున్నారు.

# వినియోగదారుల హక్కులకు రక్షణ

## - విజయవాడలో కొత్త అదనపు వినియోగదారుల ఫోరం బెంచ్ ప్రారంభం : మంత్రి నాదెండ్ల మనోహార్



విజయవాడలో కొత్త అదనపు వినియోగదారుల ఫోరం బెంచ్ ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహార్

**విజయవాడ, మార్చి 24,ప్రభాత వార్తప్రతినిధి:** వినియోగదారుల హక్కులకు రక్షణ, భరోసా కల్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగ దారుల వ్యవహారాల శాఖ ల మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. విజయవాడ సిటీ సివిల్ కోర్టు సెంటర్ లో వినియోగదారుల కమిషన్ రెండో అదనపు బెంచ్ ను సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ భవనం రెండో అంతస్థులో మంత్రి నాదెండ్ల మనోహార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, ఫోరం ఛైర్మన్, బెజవాడ బార్ అసోషియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యతలేని సరుకులు, కాలం చెల్లిన వస్తువులు అమ్ముతూ వినియోగదారులను మోసం చేసే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలో వినియోగదారుల హక్కులకు వేదికగా ఈ అదనపు బెంచ్ పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా వినియోగదారులకు తగిన సమాచారం అందించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినియోగదారుల ఫోరం కేసుల పరిష్కారం మరియు వినియోగదారులకు పరిహారం అందించడంలో చాలా ముందుందన్నారు. రాష్ట్రంలో 1,33,736 కేసులు వినియోగదారుల ఫోరంలో నమోదు చేస్తే చాలా వరకు వాటిని పరష్కరించడం జరిగిందన్నారు. వినియోగదారుల జిల్లా ఫోరం లో రూ. 50 లక్షల విలువ వరకు, రాష్ట్ర ఫోరంలో రూ. 2 కోట్ల విలువ వరకు కేసులు నమోదు చేయవచ్చన్నారు. వినియోగదారుడే రాజు అని, ప్రజలు ఎవర్ని చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. దేశంలో మొదటిసారి రాష్ట్రంలో డిజిటల్ క్యాంపెయిన్ ను స్కూల్స్, కాలేజీల్లో ప్రచారం చేస్తామన్నారు. వినియోగదారుల హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. మచిలీపట్నం వెళ్లాలంటే వినియోగదారులకు గతంలో చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. ఇప్పుడు విజయవాడలో వినియోగదారుల హక్కుల కోసం అదనపు బెంచ్ ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వినియోగదారుల హక్కులను కాపాడటంలో ముందుంటుందన్నారు.కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, విజయవాడ వినియోగదారుల అదనపు బెంచ్ ఫోరం ఛైర్మన్ సీహెచ్. కిషోర్, సభ్యులు కే.శశికళ, బెజవాడ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అరిగల శివ రామ ప్రసాద్, అధ్యక్షులు కె. చంద్రమౌళి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుల సీహెచ్. అజయ్ కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సోము కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ దంపతులు

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేవుడు మంచి ఆరోగ్యం, సంతోషం, దీర్ఘాయుష్షు హోంమంత్రికి ఇవ్వాలని కోరుతూ గవర్నర్ దంపతులు ఫోన్ చేసి విష్ చేశారు. సుదీర్ఘకాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆమెను ఆశీర్వదించారు. అందుకు బదులుగా హోంమంత్రి అనిత వారిరువురు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. హోంమంత్రి అనిత జన్మదినం మార్చి24వ కావడంతో ఆమె అన్ని మతాల దేవాలయాలు, ఆరాధనాలయాలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయించారు., ఆమెను సీఎం చంద్రబాబు నాయుడు, డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రులు సవిత, గుమ్మడి సంధ్యారాణి, నారా లోకేష్, కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎంఎల్ఎ బండారు శ్రావణిశ్రీ తదితరులు అనితకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై కోర్టు ధిక్కరణ కేసు విచారణ వాయిదా

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. అనుబంధ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టు నిర్దేశించిన సమయంలోపు జైలు అధికారుల ముందుకు ఎందుకు హాజరుకాలేదో వివరణ ఇవ్వాలని బోరుగడ్డను హైకోర్టు ఆదేశించారు. అలాగే తప్పుడు ధృవపత్రం సమర్పించి మధ్యంతర బెయిల్ పొందిన వైనంపై విచారణ నివేదికలను సీల్డ్ కవర్లో కోర్టు ముందు ఉంచాలని పోలీసులకు న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఏపీ హైకోర్టు వారం రోజులకు వాయిదా వేసింది. బోరుగడ్డ అనిల్ తప్పుడు ధృవీకరణ పత్రంతో మధ్యంతర బెయిల్ పొందినందున ఆయనకు బెయిల్ రద్దు చేయాలని పోలీసులు హైకోర్టులో పిటిషన్ వేసారు. దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో నేడు కేసును విచారించిన హైకోర్టు అతనిపై పలు ప్రశ్నలు వేసింది. తనపై పోలీసులు తప్పుడు అభియోగాలు చేస్తున్నారని అనిల్ న్యాయ వాదుల ద్వారా వాదించారు.

## నేటి నుంచి రాష్ట్రం మీదుగా పండుగ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మార్చి 24,ప్రభాతవార్త** ప్రస్తుత ఉగాది, రంజాన్ పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ రాష్ట్రం మీదుగా శాంత్రగచ్చి- చెన్నై-శాంత్రగచ్చి, బెంగళూరు-గుల్బర్గా-బెగళూరుల మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. శాంత్రగచ్చి నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే నెంబర్ 06078 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,28వ తేదీల్లో శాంత్రగచ్చి నుంచి ఉదయం 9గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3-30గంటలకు

చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. చెన్నై సెంట్రల్ నుంచి శాంత్రగచ్చి వెళ్లే నెంబర్ 06077ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26న రాత్రి 11-45గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరి రెండో రోజు ఉదయం 7-15గంటలకు శాంత్రగచ్చి చేరుకుంటుంది.

# డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయండి

## - ప్రజలకు మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకెళ్లాలి

## - ఆర్టీజిఎస్‌పై సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టీజీఎస్‌లో చేపడుతున్న డేటా అనుసంధాన ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. ఆర్టీజీఎస్ కార్యకలాపాలైన సోమవారం ఆర్టీజీఎస్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. డేటా అనుసంధానంతో ఏర్పాటు చేస్తున్న డేటా లేక్ పనుల ప్రగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేటా అనుసంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా డేటా అందివ్వని శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడి వారి నుంచి కూడా సాధ్యమైనంత త్వరగా డేటా తెప్పించి డేటా లేక్ పనులు వేగవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించేలా డేటా లేక్ ఏర్పాటు పనులు చేపట్టాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ అమలు ప్రగతిపైన కూడా సీఎస్ సమీక్షించారు. వాట్సాప్ ద్వారా 200కుపైగా సేవలందించడం శుభపరిణామన్నారు. ప్రజలకు మరింత చేరువగా వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకెళ్లాలని, ప్రజలు సులభంగా ప్రభుత్వం నుంచి అన్ని సేవలను వాట్సాప్ ద్వారా పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకునేవారి సంఖ్య ఇంకా పెరగాలని, పౌరులందరూ ఈ సేవలు ఉపయోగించుకునేలా ప్రత్యేక దృష్టి



సారించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో పౌరులు తమ వాయిస్ మెసేజ్ ద్వారా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు పొందే సదుపాయాన్ని కూడా త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది యంత్రాంగం పనితీరు మరింత పెంపొందించేలా ఈఫైళ్ల క్లియరెన్సును మదింపు వేయాలన్నారు. ఐటీ మరియు రియల్ టైం గవర్నెన్స్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతి గురించి సీఎస్‌కు వివరించారు. పౌరులు వాట్సాప్ ద్వారా కేవలం టెక్ట్స్ మెజేజ్ ద్వారానే కాకుండా తమ వాయిస్ మెసేజ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు సౌలభ్యంతో సులభంగా అన్ని సేవలు పొందేలా వాట్సాప్ గవర్నెన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ప్రస్తుతం ఇది పరీక్ష దశలో ఉందన్నారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ





**విజయవాడ, మార్చి 24,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా విజయవాడ కొత్త గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్లో వైద్యులు, నర్సింగ్.,ఇతర సిబ్బంది సోమవారం నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కూడలి సమావేశాలతో ప్రజలకు క్షయ వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లా డుతూ రెండు వారాలకు మించి దగ్గు, కళ్లె పడటం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే ప్రతి ఒక్కరు తెమడ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. అసోసియేట్ ప్రొపెసర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో కళ్లె పరీక్షలు మరియు మందులు పూర్తిగా ఉచితం అని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిఏటా 6000 మందికి కళ్లె పరీక్షలు జరుగుతున్నాయని మరియు దాదాపు 1200 మందికి టి.బి నిర్ధారణ చేస్తున్నట్లు తెలియజేశారు. మన ప్రభుత్వ ఆసుపత్రిలో కళ్లె పరీక్షలు సీబీఎన్ఎటీ మేషిన్ ద్వారా రెండు గంటలలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని చెప్పారు. మందులు వాడుతున్న సమయంలో పోషకాహార నిమిత్తం కోసం ప్రభుత్వం ప్రతి నెల 1000 రూపాయలి జమ చేస్తున్నారు.

## నేటి నుంచి రాష్ట్రంలో రైలు మార్గం పనులు

### - తెలుగు రాష్ట్రాల్లో తిరిగే సింహాద్రి, ఉదయ్‌లు రద్దు

**గుంతకల్లు రైల్వే,మార్చి 24,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల కారణంగా తెలుగు రాష్ట్రాలలో రాకపోకలు సాగించే సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రెండు రోజులపాటు రద్దు చేసినట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లోని సామర్లకోట-విశాపురం-గొల్లప్రోలు-రవికంపాడుల మధ్య ఆటోమెటిక్ సెక్షన్‌కు సంబంధించిన నాన్-ఇంటర్ లాకింగ్ సాంకేతిక పనుల కారణంగా గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య తిరిగే 17239/సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 23,24,/24,25వ తేదీల్లో రద్దు చేశారు. అలాగే విశాఖపట్నం- గుంటూరు-విశాఖపట్నం మధ్య తిరిగే నెంబర్ 22875/76, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 24న ఇరువైపులా రద్దు చేశారు.

వీటితో పాటు కాకినాడు-విశాఖపట్నం-కాకినాడ మధ్య తిరిగే నెంబర్ 17267/68మెమో ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి-విశాఖపట్నం- రాజ మండ్రి మధ్య తిరిగే నెంబర్ 67285/86మెమో పాసింజర్ రైలు సర్వీసులను సోమవారం రద్దు చేశామన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు - జిఎల్ఐ.జిపిఎఫ్ బకాయిలు రూ. 6 వేల 200 కోట్లు విడుదల!

**విజయవాడ,మార్చి24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఎంప్లాయిస్ జీఎల్ఐ.జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి ఉద్యోగుల ఖాతాల్లో బకాయిలు పడుతున్నాయి. మొత్తం రూ. 6 వేల 200 కోట్లు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిధులు విడుదల అవుతున్నాయి. నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి మంగళవారం లేదా బుధవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు జమ అవుతున్నాయని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు ఈ మేరకు ధృవీకరించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ఖాతాల్లో అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి.ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విడుదలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ. 6,200 కోట్లు చెల్లించాలని సీఎం నిర్ణయించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఏఐ కింద ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ రూ.6,200 కోట్లు విడుదల చేసింది. కాగా జనవరిలోనూ రూ.1,033 కోట్ల ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించింది.ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బకాయి రూ.6,200 కోట్లు విడుదల చేయడానికి చంద్రబాబు ఆదేశాలిచ్చారు.

## వెంకన్న ఆలయానికి వెండిమబ్బుల ఛత్రం



**తిరుమల,మార్చి 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలపై వాతావరణం చల్లబడి వెండిమబ్బులు దేవదేవుని ఆలయానికి ఛత్రంలా కమ్మేశాయి. వర్షం వచ్చేముందు మేఘాలు కదలికతో ఇలా మబ్బులు కమ్మేయడం సాధారణం. సోమవారం ఉదయం ఈ ఆహ్లాదకర,అద్భుత దృశ్యాన్ని "ప్రభాతవార్త" క్లిక్‌మనిపించింది.

వార్త

అనేక విత్తనాలను విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమవుతుందో, అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

-జెఫర్‌సన్

# ఏదీ దారి?


విత్తు ముందా? చెట్టు ముందా? అనే సంకట స్థితి ఎదురైతే ఎంతటి మేధావులకైనా ఏది ముందో చెప్పలేక జుట్టు పీక్కునే పరిస్థితి ఎదురౌతుంది. ఇప్పుడదే జరిగింది తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్వర్యంలో చెన్నైలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో. కోవిడ్ సమయంలో వాయిదా పడిన డీలిమిటేషన్ ప్రక్రియ మళ్ళీ తెరపైకి వచ్చేసరికి, దానికి సంబంధించిన అనుకూల అంశాలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య తర్జనభర్జన జరుగుతోంది. దక్షిణాదిన దాదాపుగా నాలుగు రాష్ట్రాలు కేరళ, కర్ణాటక ,తమిళనాడు, తెలంగాణలలో బీజేపీయేతర ప్రభుత్వాలు పాలన చేస్తున్నాయి. డీలిమిటేషన్ విషయంలో కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేయనప్పటికీ దక్షిణాది రాష్ట్రాలు ఆందోళనకు గురయ్యాయి. బాగా కంగారు పడుతున్నాయి.ఒకపక్కఅఖండ భారత్ దేశం నిర్మితమవ్వాలని ఎంతోమంది దేశ భక్తులు ఆకాంక్షిస్తున్న సమయంలో ప్రస్తుతం ఉనికిలో ఉన్న భారతదేశంలో ఉత్తరాది, దక్షిణాది భావనలు తలెత్తే పరిస్థితి ఎదురవుతోంది. ఎవరి ఆలోచనలు ఎలాఉన్నా ఏలిన వారి నుంచి స్పష్టత కొరవడడంతో దక్షిణాది భావనలకు బీజం ఏర్పడుతోంది. ఇది దేశ శ్రేయస్సుకు మంచిది కూడా కాదు. రానురాను ఈ అంశం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించే అవకాశం ఉంది. సాధారణంగా డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయితే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో లోక్‌సభ అసెంబ్లీ స్థానాలు సీట్లు పెరుగుతాయి. ఇలా స్థానాలు పెరగడాన్ని అన్నిరాజకీయ పార్టీలు స్వాగతిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెన్నై సమావేశంలో విచిత్రంగా కొన్నేళ్ల పాటు డీలిమిటేషన్ ప్రక్రియను పక్కనపెట్టాలనే ధోరణి వ్యక్తమయింది. ఆ మేరకు అఖిల పక్షసమావేశం తీర్మానించింది కూడా. పునర్విభజనలో మేలుపొందాలనుకున్నపార్టీలు, రాజకీయ వేత్తలు ఎందరో ఎదురుచూస్తున్నారు. అయినా కనీసం పాతికేళ్లపాటు పార్లమెంట్‌సీట్లు పెరగకపోయినా పర్వ లేదన్న రాజీకొచ్చినట్లు అర్థం చేసుకోవాలి.ఇంత కఠినమైన ప్రతిపాదన వెనుక కారణాలు విశ్లేషిస్తే త్రిభాషా అమలు విధానానికి తమిళనాడు విద్యాభివృద్ధి నిధులకూ కేంద్రం లింక్ పెట్టకపోతే, తాజా సమస్య తలెత్తేదే కాదు. గతంలోనూ నియోజకవర్గాల పునర్విభజన సమస్య తలెత్తినప్పుడు ఆనాటి ప్రధాని వాజపేయి చాకచక్యంగా వ్యవహరించారని, ఇప్పుడు ప్రభుత్వం ఆవిధంగా చేస్తే తమకు అభ్యం తరం లేదన్న ఆలోచనను కూడా సభ ముందు పెట్టారు. తీర్మానంలో మాత్రం డీలిమిటేషన్ వాయిదా వైపే మొగ్గు చూపారు.1977 జనాభా లెక్కల ప్రకారం జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజ నలో మరో 25ఏళ్ల పాటు కొనసాగించాలని జేఏసీ కేంద్రానికి విజ్ఞప్తిచేసింది. ఎటువంటి డీలిమిటేషన్ అయినా అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో చేయాలనికోరారు. ప్రస్తుత ఆలోచనలతో దక్షిణాదిలో కనీసం 100 సీట్లు కోల్పోతాయని గతంలో ప్రధానిచెప్పిన విషయాన్ని గుర్తు కు తెచ్చారు. అదే జరిగితే రాజకీయ పరంగా ప్రాంతీయ పార్టీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. పునర్విభజనపై తమకున్న సందేహాలను కేంద్రంతీర్చిన తర్వాతనే ముం దడుగు వేయాలని జేఏసీ కోరింది.దక్షిణాది రాష్ట్రాలు జనాభానియంత్రణ పాటిం చకపోతే రాష్ట్రాలలో జనాభా విస్ఫోటనం జరిగి ఉండేది. అభివృద్ధి బాటలు తప్పేది. అలా జరగకుండా చూసినందుకేనా దక్షిణాది రాష్ట్రాలపై పునర్విభజన కత్తిని వెళ్లాడదీస్తున్నారని ఒడిశా మాజీ సిఎం నవీన్ పట్నాయక్ వంటి వారు సైతం సెంటర్‌పై ఆగ్రహం వెలిబుచ్చారు. త్రిభాషా సూత్రం పేరిట బలవం తంగా హిందీ భాషను రుద్దబోతున్నారనేఅభిప్రాయంతో స్టాలిన్ వెంటనే స్పందించారు. ఒకదానికొకటి తోడుగా డీలిమిటేషన్ సమస్యవెలుగులోకి వచ్చింది. దాంతో దక్షిణాదిన అధికారంలోఉన్న 4ప్రధాన రాష్ట్రాలు తీవ్రంగా స్పందించాయి. పార్లమెంట్ సీట్లలో తగ్గినా, అసెంబ్లీ సీట్ల పెరుగుదలపై ప్రభావం కలగని రీతిలో రాష్ట్రాలలో పునర్విభజన జరగాల్సిందేనన్న ఆలోచన కూడా బయటపడింది. ఈ సమస్యల పరిష్కారానికి దేనికీ పొంతన కుదరడం లేదు. చెప్పాలంటే ఒకప్పుడు భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, ఇటీవల కాలంలో ఆయారాష్ట్రాలలో అధికారం చెలాయిస్తున్న ప్రాంతీయ పార్టీలు, ఆయా ప్రాంతీయవాసుల అభిమతాలు, ఆకాంక్షలతో ముందుకు పోదలుచు కున్నాయి. కాగా త్రిభాషా సూత్రం పేరిట బలవంతంగా హిందీ భాషను రుద్దబోతున్నారని అనుకున్నస్టాలిన్ వెంటనేస్పందించారు. ఒకదానికొకటి తోడుగా డీలిమిటేషన్ సమస్య వెలుగులోకి వచ్చింది. తాజాపరిస్థితుల్లో దక్షిణాదిన అధికారంలోఉన్న 4ప్రధాన రాష్ట్రాలు తీవ్రంగా స్పందించాయి. ఆయా ప్రాంతాలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు, 14పార్టీల నేతలుసమావేశానికి హాజరై రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం కలిగించకుండానియో జకవర్గాల పునర్విభజన అందరి సమ్మతితో చేపట్టాలని కోరారు.ఒకవేళ పార్లమెంట్ సీట్లలో తగ్గినా, అసెంబ్లీ సీట్ల పెరుగుదలపై ప్రభావం కలగనిరీతిలో పునర్విభజన జరగాల్సిందేనన్న ఆలోచన ప్రాంతీయ పార్టీలది. ఈ సమస్యల పరిష్కారానికి దేనికీ పొంతన కుదరడంలేదు. ఒకదానికొకటి ముడిపడని అంశాలైనా ప్రాంతీయ పార్టీల కలవరపడుతున్నాయి.కుటుంబ సంక్షేమ పథకాలను నిజాయితీగాపాటించడం తమ తప్పిదమా అనే ఆలోచన కూడా చేస్తున్నారు. పునర్విభజన తప్పనిసరి అయితే దక్షిణాదికి ముప్పైమూడు శాతం పార్లమెంటు స్థానాలివ్వడం న్యాయమనే వాదనలు ఉన్నాయి. ఈ వాదనలన్నింటికి ప్రధాన కారణాలను, పరిష్కారాలను విశ్లేషించి దక్షిణాది, ఉత్తరాది అనే భావన కలగని రీతిలో సమస్యను సానుకూలంగా పరిష్కరించాలి.

ఆకలి రుచి ఎరుగనట్లే, మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కన్పించవు.



ఆస్కార్‌వైల్డ్

మితభాష, మితభుక్తి, మిత నిద్ర ఇహపరాలను సుఖమయం చేస్తాయి.



ప్లినీ

# ప్రజావాక్కు



## అధిక యాంటీ బయోటిక్స్ ప్రమాదం

వ్యాధుల పరిరక్షణలో కీలకపాత్ర పోషించేయాంటీ బయోటిక్స్ విచ్చలవిడి వాడకం పై భారతీయ ఆరోగ్య సమాఖ్య ఆందోళన వ్యక్తం చెసింది. అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం, అవగాహన లోపం కారణంగా ఏడాదికి ఏడాది వీటివిచ్చలవిడి వినియోగం దేశంలో పెరుగుతూనే ఉంది. గత దశాబ్దకాలంలో 30శాతం వినియోగం పెరిగినట్టు 2021లో విడుదలైన ప్రపంచ యాంటిబయాటిక్స్ నివేదిక నిర్ధారించింది. నిపుణుల అంచనా ప్రకారం యాంటీ మైక్రో బియల్ రెసిస్టెన్స్ కారణంగా 2050 నాటికి ఏటా కోటిమందిమరణిస్తారని అంచనాలు వెలువడ్డాయి. యాంటి బయాటిక్స్‌ను ఎక్కువగా వాడటంవల్ల బ్యాక్టీరియాలు జన్యుపరిణామం చెంది, మందులను తట్టుకునే శక్తిని పొందుతాయి. దీంతో శక్తివంతమైన యాంటిబయాటిక్స్ వాడాల్సి వస్తుంది. చివరకు వాటిలో కొన్ని ఏ మందులకు లొంగకుండామనుషుల్నిచంపే శక్తినికూడా పొందుతాయి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## టోల్ ఫీజుకు ఇన్సూరెన్స్ ఇవ్వాలి

మనం నిత్యం హైవేలపై ప్రయాణిస్తూ ఉంటాము. రోడ్డు మీదవాహనాలు తిరుగుతే దానికి అనుకూలంగా టోల్ ఫీజు కడుతున్నాం. ఇది ఎంతకాలం అనికట్టాలి. దానికి పరిమితి లేదా? ఎన్ని ఏళ్లు రోడ్ల నిర్మాణ వ్యయం వసూలు చేస్తారు. అసలు అన్ని ఏళ్లు నిర్వహణ కోసం పేద మధ్య తరగతి ప్రజలను బాదడం అవసరమా. పోనీ ఆ టోల్ కట్టిన వారికి ఏదన్నా ఆ రోడ్డు పై ప్రమాదం జరిగితే వారికి ఇన్సూరెన్స్ ఇస్తున్నారా? అలా కాకుండా అనవసరంగా భారీ టోల్ టాక్సులు వసూలు చేయడం వల్ల ప్రజలకు ఏం లాభం.? ఈ విషయంలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తక్షణం స్పందించాలి.

-ఎస్. శేషగిరి, సికింద్రాబాదు

## కార్యాచరణకు నోచుకోని ప్రతిపాదనలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పరిస్థితి మరింత దారుణంగామారుతోంది.దానితో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. పొలాల్నిశుభ్రం చెయ్యడానికి వారి ముందున్న సులభమైన, చౌకైనమార్గంగడ్డిని తగలబెట్టడమే.గడ్డిని తగలబెట్టకుండా ఆపేందుకు రైతులకు ఆర్థిక పరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని, యంత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాలు రకరకాలప్రతిపాదనలు తెరపైకి తెచ్చాయి.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

## పన్నుల భారం తగ్గించాలి

రాష్ట్ర పురోభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం పలు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం ఆహ్వానించదగిన పరిణామం. అయితే ఇదే సందర్భంలో మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం మోపడం సరికాదు. గత ప్రభుత్వ తప్పిదాలతో విద్యుత్ చార్జీలు గణనీయంగా పెరిగాయి.ఇప్పుడు సర్దుబాటు పేరుతో మరింత పెంచడం దారుణం. అలాగే తాజాగా పిపిపి మోడల్‌లో రహదారులను అభివృద్ధి పరుస్తామంటున్నారు. ఇందువలన కూడా ప్రజలపై పెనుభారం పడుతుంది. రాజధాని రవాణా అవసరాల కోసం రహదారి ప్రతిపాదన కూడా ప్రైవేటు భాగస్వామ్యంతో ముందుకు తీసుకు వస్తున్నారు. నిజానికి ఈ ప్రతిపాదనలో ఏ మాత్రం హేతుబద్ధత లేదు. ఆయా గ్రామాలను ఇప్పటికే నిర్మితమై ఉన్న జాతీయ రహదారులు,ప్రతిపాదిత బాహ్య వలయ రహదారికి అనుసంధానించి, అందుకు కావలసిన రహదారులు, వంతెనలు నిర్మిస్తే సరిపోతుంది.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

## బాధ్యతను విస్మరిస్తున్నారు

ప్రతిపక్ష నాయకుడు తప్పనిసరిగా చట్టసభల సమావేశాలకు హాజరై చర్చలోపాల్గొనాలి. ప్రభుత్వవైఫల్యాలను నిలదీయాలి. ప్రజాసమస్యలను సభ దృష్టికి తీసుకురావాలి. సభలో ఎలా నడుచుకోవాలో తమ పార్టీ సభ్యులకే దిశానిర్దేశం చేయాలి. సభ వెలుపల కూడా ప్రజలతో మమేకం అవుతూ వారి సాధకబాధలు తెలుసుకోవాలి. వారికే కష్టం వచ్చినా ఆదుకునేలా ఉండాలి. అంతేకాని అధికారం పోగానే డీలా పడిపోయి శాసనసభ మొహం చూడకుండా ప్రజలను పట్టించుకోకుండా ఒక్క మాట మాట్లాడకుండా మౌనంగాఉండకూడదు.గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవ్వరు ఇలా లేరు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## ఉక్కుపాదం మోపాలి

యువత గంజాయికి బానిసలవుతున్నారు. దానిలో మునుగుతూ క్షణికావేశంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. పాఠశాల,కళాశాల విద్యార్థులు సైతం మత్తుకు బానిసలవుతున్నారు. గంజాయి చ్లాక్లెట్స్ కూడా విక్రయిస్తున్నారు. గంజాయి కొనుగోలు అనుమానం రాకుండా బస్సులు, లారీలు, వ్యాన్ ట్యాంకర్లలో రవాణా చేస్తున్నారు.గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలపై పోలీసులు ఇంకా ఎక్కువ నిఘా పెట్టి వీటి అణచివేతకి ఉక్కుపాదం మోపాలి.

-కె.ఆంజనేయులు, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaartha@gmail.com)

# సేంద్రియ సేద్యం భవిష్యత్తు భద్రం

**సేంద్రియ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా అధిక డిమాండ్ ఉంది. రైతులకు అంతర్జాతీయంగా మంచి ధర లభించే అవకాశం కూడా వుంది. ప్రజల్లో నానాటికీ సేంద్రియ ఆహారంపై అవగాహన పెరుగుతోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడమే దీనికి కారణం. సేంద్రియ విధానాల్లో కార్బన్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ తగ్గుతుంది. అలాగే రసాయన ఎరువుల, పురుగుమందుల వాడకం తగ్గడం వలన పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతోంది. పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం ఉత్పత్తి చేయాలంటే రసాయన వ్యవసాయం వల్లే సాధ్యమవుతుందని చాలా మంది భావిస్తారు. కాని అది భవిష్యత్తు తరాల ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందనే విషయాన్నీ గుర్తించరు. సేంద్రియ వ్యవసాయం ద్వారా మొదట్లో కొంత దిగుబడి తగ్గినా రానురాను దిగుబడి, నాణ్యత పెరుగుతోంది. దీర్ఘకాలంలో జనాభాకు సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి అవుతుంది.**

జి. అజయ్ కుమార్

ఆరోగ్యకరమైన జీవన శైలికి సేంద్రియ ఆహారమే జీవనాడి. భారత దేశంలో 4000 సంవత్సరాల క్రితమే సేంద్రియ సాగుకు సంబంధిన ఆధారాలు లభించాయి. బ్రిటిష్ వారి కాలంలో వ్యవసాయ స్వరూపం పూర్తిగా మారి కృత్రిమ ఎరువుల, యంత్రాల వాడకం మొదలైనది.భారతదేశంలో హరిత విప్లవం తరువాత వీటి వాడకం బాగా పెరిగింది. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల స్థానంలో సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నాయి. సంప్రదాయ సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువగా వుంటుంది. అదే కాకుండా వ్యవసాయ అవసరాల కోసం ఎక్కువగా బాహ్య వనరులపై ఆధారపడడం, పనిముట్లు, యంత్రాల వినియోగం వల్ల వ్యయం అధికం కావడం వంటివి జరుగుతాయి. ఇంకా పర్యావరణం, జీవ వైవిధ్యం, నేలపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపుతుంది.ది వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2025వార్షిక నివేదిక ప్రకారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 9.9కోట్లహెక్టార్ల విస్తీర్ణంలో సేంద్రియ సాగు జరుగుతోంది. 43 లక్షలమంది సేంద్రియ రైతులు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వున్నారు. అందులో అత్యధికంగా 24లక్షల మంది భారతదేశంలోనే వున్నారు. తరువాతి స్థానాల్లో ఉగాండా (5లక్షలు), ఇథియోపియా (2లక్షలు) వున్నాయి. విస్తీర్ణం పరంగా 5.3 కోట్ల హెక్టార్లతో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో, 4.5లక్షల హెక్టార్లతో ఇండియా రెండో స్థానంలో వుంది. సేంద్రియ ఉత్పత్తుల వినియోగంలో అమెరికా, యురోపియన్, కెనడా, బ్రిటన్, స్విట్జర్లాండ్, టర్కీ వంటివి ముందు వరుసలో వున్నాయి. భారతదేశంలో ప్రస్తుతం సేంద్రియ పద్ధతులను అవలభించే సర్టిఫికేషన్ కలిగిన భూమి వైశాల్యం 10.17 మెగా హెక్టార్లుగా వుంది. వీటి నుండి 2.9 మిలియన్ మెట్రిక్ టన్నుల సర్టిఫైడ్ సేంద్రియ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారు. వీటిలో ఎక్కువగా ఆహార ధాన్యాలు, చెరుకు,నూనెగింజలు, పత్తి, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలు, కాఫీ,టీ,పండ్లు, డ్రై ఫ్రూట్స్ వంటివి వున్నాయి. భారత దేశంలో సేంద్రియ ఉత్పత్తులలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక ఒడిస్సా వంటి రాష్ట్రాలు మొదటివరుసలో వున్నాయి. సేంద్రియ సాగులో ఈశాన్య రాష్ట్రాలు ముందుంటాయి. 2016లో సిక్కిం ప్రపంచంలోనే తొలి సేంద్రియ రాష్ట్రంగా నిలిచింది. వారి తెగలలో పూర్వ కాలం నుంచే సేంద్రియ సాగుపై మక్కువ ఎక్కువగా ఉంటుంది. సమస్త జీవకోటి మనుగడకి భూమే ఆధారం. అలాంటి భూమిని, పంటలలో అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువులు, పురుగుమందులు వాడి విషతుల్యం చేస్తున్నారు. దాని వలనభూసారం తగ్గి, భూమి కలుషితమై, నీటి కాలుష్యం, పర్యావరణ కాలుష్యం జరిగి, ఆరోగ్య సమస్యలు పెరిగాయి. వీటికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) అనేది ఎంతో ఉపయోగకరంగా మారింది. సేంద్రియ వ్యవసాయం అనేది రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ఇతర కృత్రిమ ఉత్పత్తులను ఉపయోగించకుండా, సహజసిద్ధమైన విధానాల్లో పంటలను పెంచే వ్యవసాయ పద్ధతి. ఇదిసహజ ఎరువులు, జీవన ఎరువులు ప్రకృతికి అనుకూలమైన పద్ధతులు ఉపయోగించడం, దీని ద్వారా మట్టిసారాన్ని పెంచి, పర్యావరణాన్ని రక్షిస్తూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి దోహదపడుతుంది. ఈ విధానం ప్రకృతి సమతుల్యతను కాపాడటం, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం వంటి ప్రయోజనాలను కలిగి ఉంటుంది. సేంద్రీ య వ్యవసాయంలో జీవ సమతుల్యం, అధిక దిగుబడుల కోసం సహజ పద్ధతులతో పాటు పోషకాలను కూడా వినియోగిస్తారు. దీనిని ఇంటిగ్రేటెడ్ ఆర్గానిక్



ఫార్మింగ్ అంటారు. అలాకాకుండా పూర్తిగా సహజ పద్ధతులతోనే వ్యవసాయం చేస్తే దానిని ప్యూర్ ఆర్గానిక్ ఫార్మింగ్ అం టారు. రైతులు వారి ప్రాంతాలను, పంటలను బట్టి నచ్చిన విధానాన్ని అనుసరిస్తారు. రసాయన ఎరువుల స్థానంలో సహజఎరువుల వినియోగం, పోస్ట్,వర్మీ కంపోస్ట్, పచ్చి రొట్టె ఎరువులు, గోఆధారిత ఎరువులు మొదలైనవి వాడి మట్టిని సారవంతంగా మార్చడం. వెల్లుల్లి, మిరప, అరిటాకు, నిమ్మ,పచ్చి మిర్చి, వేపాకు, కషాయాలు వంటి స్వాభావిక పద్ధతులు పురుగుల నివారణకు సహాయపడతాయి. రైజోబియం, అజోటోబాక్టర్, పాస్ఫో బాక్టర్, పొటాష్ మొబైలే ఇజింగ్ బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు భూమికి నత్రజని, భాస్వరం, పొటాషియం అందించడంతో పాటు భూసారాన్ని పెంచుతాయి. వీటితో పాటు ఇంకా చాలా జీవన ఎరువులు సేంద్రియ వ్యవసాయంలో సహాయపడతాయి.ఒకే భూమిలో వివిధరకాల పంటలు సాగుచేసి భూసారాన్ని కోల్పోకుండా కాపాడడం, దీర్ఘకాలం పాటు ఒకే రకమైన పంటను సాగు చేయడంవలన భూమిలో సారం క్షీణించి దిగుబడులు తగ్గడం, వ్యాధులు ప్రబలడం వంటివి జరుగుతాయి.సేంద్రియ వ్యవసాయ విధానాల్లో తక్కువనీటి వినియోగం ద్వారా నీటివనరుల సంరక్షణ. రసాయన ఎరువుల వినియోగం లేకపోవడం వల్ల భూమి సహజ జీవచర్య కొనసాగుతుంది. మట్టిలో సారం క్షీణించకుండా తేమను నిల్వ ఉంచుకుని, భూసారం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల అధిక ధరలు లభిస్తాయి. వ్యయం తక్కువగా ఉండడం వల్ల రైతులకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. రసాయనాల ప్రభావం లేకుండా స్వచ్ఛమైన, పోషకభరితమైన ఆహారం అందుబాటులోకి వస్తుంది. దీనివలన క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత, కిడ్నీవ్యాధుల వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ప్రజలలో చాలావరకు ఆరోగ్య సమస్యలు కనుమరుగవుతాయి. నీటి కాలుష్యం, గాలి కాలుష్యం, భూసార నాశనం తగ్గిపోతాయి. కార్బన్‌ఉద్గారాలు తగ్గడం వల్ల వాతావరణ మార్పులను ఎదుర్కోవచ్చు.సేంద్రియ ఉత్పత్తులకోసం ప్రత్యేక మార్కెట్లను అభివృద్ధి చేసి ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలి. అలాగే నేరుగా వినియోగదారులకు విక్రయించే విధానాలను కూడా అభివృద్ధి చేయాలి. అలా రైతే నేరుగా లబ్ధి పొందుతాడు. సేంద్రియ వ్యవసాయం గురించి రైతులకు క్షేత్ర స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు, అవగాహన కార్యమాలు నిర్వహించాలి.రైతులకు మద్దతుగా నిధులను, రుణాలను అందించాలి. నకిలీ ఉత్పత్తులను అరికట్టేందుకు ప్రత్యేక ప్రమాణాలను (సర్టిఫికేషన్) ఏర్పాటు చేయాలి. తద్వార నిజమైన సేంద్రియ ఉత్పత్తులు ప్రజలకు చేరువ కావడం జరుగుతుంది, అలాగే నిజమైన సేంద్రియ రైతుకు లబ్ధి చేకూరుతుంది. సేంద్రియ వ్యవసాయంలో పరిశోధనలకు అలాగే సేంద్రియ రైతుల ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం 2005 నేషనల్ పాలసీ ఆన్ ఆర్గానిక్ ఫార్మింగ్ నీ, ఈశాన్య రాష్ట్రాలలో సేంద్రియ సాగుకు సంబంధించి సర్టిఫికేషన్, మార్కెటింగ్ కొరకు మిషన్ ఆన్ ఆర్గానిక్ వేల్యూ చైన్ డెవలప్మెంట్ ఫర్ నార్త్ ఈస్ట్ రీజియన్‌ను ఏర్పాటు చేయటం జరిగింది. వీటితో పాటు పరంపరగత్ కృషి యోజన, ఆత్మ నిర్భర్ భారత్, వన్ డిస్ట్రిక్ వన్‌ప్రొడక్ట్ వంటివి ఏర్పాటు చేసి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది. సేంద్రియ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా అధిక డిమాండ్ ఉంది. రైతులకు అంతర్జాతీయంగా మంచి ధర లభించే అవకాశం కూడా వుంది. ప్రజల్లో నానాటికీ సేంద్రియ ఆహారంపై అవగాహన పెరుగుతోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడమే దీనికి కారణం. సేంద్రియ విధానాల్లో కార్బన్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ తగ్గుతుంది. అలాగే రసాయన ఎరువుల, పురుగుమందుల వాడకం తగ్గడం వలన పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతోంది. పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం ఉత్పత్తి చేయాలంటే రసాయన వ్యవసాయం వల్లే సాధ్యమవుతుందని చాలా మంది భావిస్తారు. కాని అది భవిషత్తుతరాల ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందనే విషయాన్నీ గుర్తించరు. సేంద్రియ వ్యవసాయం ద్వారా మొదట్లో కొంత దిగుబడి తగ్గినా రాను రాను దిగుబడి, నాణ్యత పెరుగుతోంది. దీర్ఘకాలంలో జనాభాకు సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి అవుతుంది. భూమిని సంరక్షించేందుకు, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించేందుకు సేంద్రియ సేద్యం అనివార్యంగా మారింది. రైతులు ఈ మార్గాన్ని స్వీకరించి, భూసారాన్ని పునరుద్ధరించి, ప్రకృతిని కాపాడే విధంగా వ్యవసాయం చేయడం ఎంతో అవసరం. •

# కొన్ని రాష్ట్రాలకు కొరుకుడు పడని పునర్విభజన


జోస్యుల వేణుగోపాల్

ఒక దేశానికి సంబంధించిన పాలనా పరమైన, అంతర్గతమైన నిర్ణయ్యాలెనప్పటికీ, అది ప్రపంచంలోని కొన్ని దేశాలపైనా, స్వదేశంపైన, స్వదేశంలోని రాష్ట్రాలపైనా పడే ప్రభావాన్ని పాలకులు గుర్తించాలి. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో పునర్విభజన జరిగిన సమయంలో గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న కొన్ని సంస్థానాలు విలీనం కావడం, అన్నీ ఒకే గొడుగు కిందకు రావడం జరిగినా కాశ్మీర్ ప్రస్తావనకు వచ్చినపుడు మాత్రం ఏవో రాజకీయాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎదురొన్నారు. ఇక అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన క్రితం సారికానీ ఈసారి కానీ వలసదారులంటూ తమ దేశంలో ఉన్నవారు అక్రమంగా ఉద్యోగం పేరుతో నివసిస్తున్నారంటూ కఠినమైన నిర్ణయాలు తీసుకుని లక్షలాది మంది అక్కడ నివసిస్తున్న వారిని దేశం నుండి వారి స్వదేశాలకు గెంటేశారు. ఇకరిటన్ సుంకాలంటూ, ప్రత్యేక సుంకాలంటూ, ఆంక్షలంటూ తమకు అనుకూలంగా లేని దేశాలపై ఏదోవివక్ష కారణంగా నిలకడ లేని విదేశాంగ విధానంతో అగ్రరాజ్యం అలుసైపోతున్నది. చాలా దేశాలు కూడా మతపరమైన విధానాలను తలకెత్తుకుని తమ దేశంలోని పాలనను పట్టించుకోరు. ఇక మన దేశంలో ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ నియోజకవర్గాలు 543 పెరిగిన జనాభా ప్రతిపదికన డీలిమిటేషన్ జరుగుతుందనుకుంటున్న సమయంలో ఈ పునర్విభజన పేరు వింటే జనాభా ప్రాతిపదికలో తక్కువగా ఉన్నరాష్ట్రాలు భయపడుతున్నాయి. రాష్ట్రాల్లో కొలువుంటున్న పార్టీలు తమ అధికార ప్రాభవం కోసం అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగాలని కోరుకుంటున్నాయి. ఒక రకంగా జిల్లాలను విభజిస్తూ పెంచుతున్న కారణం కూడా అదేకావచ్చు. కానీ జనన మరణ లెక్కలు చాలాచోట్ల పారదర్శకంగాలేవని ఎన్నికల సమయంలో తమకు అనుకూలంగా లేని ఓటర్ కార్డులనే తొలగిస్తున్నారని కొన్ని పార్టీలు మొత్తుకుంటాయి. ఓటర్ లిస్ట్‌లో చేరని పేర్లు, చేరిన పంథాలో చాలాచోట్ల డెబ్భైశాతమే పోలవుతున్న ఓట్లు, వేసిన ఒట్లన్నీ అవకతవకలు జరిగి ఇ.వి.ఎంలు మింగేశాయనే వివాదాలు, సుమారు 98 కోట్లగా ఉన్న ఓటర్లలో 70కోట్లలోపే ఓటేస్తున్న పరిస్థితిని చక్కదిద్దకుండా గెలుపుకు అనేక మార్గాలు వెతుకుతున్న పార్టీలు, సహేతుకమైన సమాధానాలు చెప్పలేని ఎన్నికల కమీషన్లు, ఇన్ని విఫల వ్యవస్థల మధ్య పునర్విభజన వల్ల జరిగేది మేలో కీడో తెలియదు. మొత్తం 543 పార్లమెంట్ స్థానాలను అలాగే వుంచి జనాభా లెక్కప్రకారం చేస్తే కొన్ని రాష్ట్రాల్లో ఉన్న సీట్లు కోల్పోయి మరికొన్ని రాష్ట్రాలో పెరుగుతాయి. అలా కాకుండా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీలను జనాభా లెక్కన పెంచితే కొన్ని రాష్ట్రాల్లో ఉన్న సీట్లుకోల్పోక రాష్ట్రాలో నియోజకవర్గాల మార్పులతోపాటు కొన్ని రాష్ట్రాలో బాగా ఎక్కువ సీట్లు పెరుగుతాయి. ఇది కేంద్రంలో ఉన్న పాలక పార్టీ రాజకీయ ఎజెండాగా కొంత మంది ప్రతిపక్షాల నాయకులకు అనుమానం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దీనిపై కొంత వివరణ ఇచ్చినా ఏ పద్ధతి ప్రకారం ఈ ప్రకియ జరుగుతుందో ఖచ్చితమైన వివరణ లేదు.దీని ప్రభావమే రాష్ట్రాల శాసన మండలిపైన, రాజ్య సభపైన కూడా ఉంటుంది. ఒకప్పుడు భాషా ప్రాతిపదికన ఏర్పడ్డ రాష్ట్రాలు అధికారాలు మారడం, ప్రాంతీయ పార్టీలు కేంద్రంలోను, జాతీయ పార్టీలు రాష్ట్రాల్లోను భాగస్వామ్యంగా కొనసాగడం మొదలయ్యాక హద్దులు చెరిగి కేంద్రం మిధ్యఅన్న వారంతా సయోధ్య, సహకారం మా మధ్య అని అధికారం అనుభవిస్తూ వారి ఉనికికి ప్రమాదం వచ్చిన ప్పుడు మాత్రం అన్ని రాష్ట్రాలు, ఈ సమస్యలకు సంబంధం లేని ప్రజలు ఉద్యమించాలని కోరుకుంటారు.1971 జనాభా లెక్కల ప్రకారం 2026 వరకు రాజ్యాంగ సవరణ లిమిట్ ఉన్నా తర్వాత జరిగిన జనాభా జనన మరణ లెక్కలు యాక్యురేస్‌గా వస్తే ఇది సాధ్యపడుతుంది. డీలిమిటేషన్ తర్వాత అది కోల్పోతే ఉత్తరాది రాష్ట్రాల గుత్తాధిపత్యంతో నష్టపోయే ప్రమాదం కూడా ఉంది. దేశమంతా ఒకే విధానం కొనసాగాలనేది కొన్ని పార్టీల వాదన. ఏదిఏమైనా చాలా రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న సందర్భంలో ఈ విషయంపై చట్టసభల్లో కూలంకషమైన చర్చ జరిగి ఒక ఏకాభిప్రాయానికి వచ్చాక నిర్ణయాలు తీసుకుంటే మంచిదనేది జనాభిప్రాయం. •

# న్యాయస్థానాల తీర్పులో జాప్యమెందుకు?

పూసాల సత్యనారాయణ

నేను ఎక్కవలసిన రైలు ఒక జీవిత కాలము లేటుఅన్న చందంగా ఉంది నేడు కోర్టులు ఇస్తున్న తీర్పులు.ఇక్కడ మాత్రం ఆలస్యం అమృతం కాదు విషమే. అసలే మనిషి జీవితం చిన్నది.కోర్టుల చుట్టూ దశాబ్దాలుగా తిరిగితే ఆస్తులు అంతస్తులు కరిగిపోయి శక్తులుడిగిపోయి మనిషి బతికి బట్టకట్టేనా? డబ్బుకు గడ్డి తిని మానవత్వం మరచి నిర్దాక్షిణ్యంగా హత్యలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో దృశ్యాలు చూస్తూనే ఉన్నాం. అంటరానితనం,మూఢనమ్మకాలను రూపుమాపుటకు సంఘసంస్కర్తలే గాక కలం పట్టి గళం ఎత్తి పేరు మోసిన కవుల ప్రయత్నాలు కూడా సఫలీకృతము గాకపోవడం శోచనీయం. ప్రేమపెళ్లిళ్ల కులమతాల చిచ్చులో రగిలి పేగుబంధం తెంపుతున్నారు. అగ్రవర్ణాలలో మార్పు ఇంకెప్పుడు వచ్చేది?. నేటి బాలురు రేపటి పౌరులు అంటే వీరేనేమో? తల్లిదండ్రులు అక్షరాస్యత వున్నవారైనా పిల్లలను మనిషిగా ఎందుకు తీర్చి దిద్దలేకపోతున్నారు. మార్పు ఇంటి నుండే మొదలుకావాలి. ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పు సోషల్ మీడియాలో కోడై కూసింది.'మిర్యాల గూడకు చెందిన మారుతీ రావు కుమార్తె అమృత వర్షిణి, ప్రణయ్‌తో 2018 జనవరి 31 న హైదరాబాద్ ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. అమృత ప్రణయ్‌ని పెళ్లిచేసుకోవడం అమృత తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. వారి పెళ్లివీడియోలు ప్రసార మాధ్యమాలలో చక్కర్లు కొట్టడంతో అవమానంగా భావించి కులోన్మాదం ప్రతీ కారం రగిలిపోయి ప్రణయ్‌ను హత్య చేయుటకు పథకం వేసి చంపించాడు. ఈ సంఘటన 2018 సెప్టెంబర్ 14రోజున చోటు చేసుకొంది. అప్పట్లో ఇది దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.కులాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఈ హత్యను తీవ్రంగా ఖండించి ర్యాలీలు, ఆందోళనలునిర్వహించారు.అప్పటి నల్గొండ ఎస్పీ ప్రణయ్ హత్య కేసును సవాల్‌గా తీసుకొని పకడ్బందీగా దర్యాప్తు చేయించి సాక్ష్యాధారాలతో సరైన సమయంలో కోర్టుకు సమర్పించారు. ఆరు సంవత్సరాల తర్వాత తేది 1. 03. 2025 రోజున నల్గొండ రెండవ అదనపు జిల్లా కోర్టు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పుఇచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మారుతీ రావు 2020లో ఆత్మహత్య చేసుకోగా రెండో నిందితుడు సుభాష్ శర్మకు ఉరిశిక్ష మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగారా శిక్షవిధిస్తూ జడ్జి రోజారమణి గారుతీర్పునిచ్చారు. ఇట్టి తీర్పుపై ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. తన భర్తను చంపిన వారికి ఇన్నాళ్లకు తగిన శిక్ష పడి న్యాయం జరిగినదని అమృత్ వర్షిణి సంతోషంవ్యక్తం



చేశారు. శక్తివంచన లేకుండా కృషి చేసిన అప్పటి ఎస్పీ, పోలీసు యంత్రాంగానికి ఆదర్శనీయంగా నిలిచాడు. ఈ తీర్పు కులోన్మాద హత్యలు చేసిన నేరస్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ కేసును ముందే విచారించి శిక్షలు విధించిఉంటే కులోన్మాద హత్యలు జరిగి ఉండేవికావని బాధిత కుటుంబాలు వాపోయారు. కాలయాపన చేయకుండా త్వరగా తీర్పులు ఇచ్చుటకు 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో' విచారణ చేయించి వెంటనే శిక్షలు పడేలా ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి చర్యలు తీసుకోవాలి అని మహిళాలోకం గగ్గోలు పెడుతుంది.అనవసరమైన తీర్పు వాయిదాలు అరికట్టవలసిన బాధ్యత జడ్జిలు న్యాయవాదులే అని సుప్రీం కోర్టు ఇంతకుముందే ఘాటుగా మందలించినా వారిలో మార్పు రాకపోవడం న్యాయమేనా ? ఏది ఏమైనా ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడేది న్యాయస్థానాలే అని చెప్పకతప్పదు. చట్టాలను ధిక్కరించి ఘోరమైన నేరాలు చేసిన దేశాధిపతులైనా ఉరిశిక్షలు నుండి తప్పించికోలేదు. బ్రిటిష్ కాలం నాటి బూజు పట్టిన చట్టాలను సవరించి కాలానుగుణంగా న్యాయ వ్యవస్థ ప్రక్షాళన చేయవలసిన అత్యంత అవసరం ఎంతైనా ఉంది. ఉన్నత న్యాయస్థానాలు తమ పని దినాలను, పని గంటలను పెంచుకోవల్సిన అవసరం ఉంది. 5గంటల పని వేళలనుసబార్డినేట్ కోర్టుల మాదిరి 6గంటలకు పెంచాలి. సంక్రాంతి, దసరా సెలవులు రద్దు చేయాలి. ప్రాధాన్యత క్రమంలోకేసు విచారణ చేపట్టాలి. ఉన్నత న్యాయస్థానాలు కూడా కేసుల ముగింపుకై కాలపరిమితి విధించుకోవాలి. ప్రాసిక్యూటర్స్ ప్రభుత్వ న్యాయవాదులు అనధికారికంగా ఆబ్సెంట్ అవడం కూడా కేసులు వాయిదాకు కారణాలు. కోర్టుల పని తీరు ప్రజలందరికీ తెలియచేయాలి. హై కోర్టునుండి జూనియర్ సివిల్ జడ్జివరకు కోర్టులో ఎన్నికేసులు విచారణలో ఉన్నాయి? ఎన్ని కేసులు తీర్పులు ఇచ్చారు? పాత కేసుల వివరాలు పత్రికలకు విడుదల చేయాలి. మిగతా న్యాయస్థానాలు ఈవివరాలు పబ్లిక్ నోటీసుబోర్డులో ప్రజలు చూసేలా ప్రదర్శించాలి. ఇందులో హై కోర్టుపర్యవేక్షణ ఉన్నప్పుడే సత్వర పరిష్కారం అయ్యే అవకాశాలుంటాయి. దీనికి న్యాయ శాఖ మంత్రి గాని సుప్రీం కోర్టు ప్రధానన్యాయమూర్తి గానిఫోకస్ చేసిన యెడల శతాబ్దాలుగా కోర్టుచుట్టు తిరిగి అమూల్యమైన జీవితకాలం వృధా కాకుండా ఉండే అవకాశం ఉంది. నేరారోపణ ఎదుర్కొంటున్న వారు అరెస్టు అయిన తర్వాత కోర్టులు వారికి బెయిల్స్ మంజూరి చేయడం చూస్తుంటే న్యాయ్యవస్థనుకూడా కాలుష్యం చుట్టేసిందా అన్న సందేహం కలుగుతుంది. న్యాయాధికారులు నీతిగా నిజాయితీగా ఉండి ప్రజాస్వామ్యానికి రక్షణ కవచాలుగా నిలువాలి. న్యాయంపై ప్రజలకు విశ్వాసం ఉండేలా చూసుకోవల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపైనే ఉంది.ఏది ఏమైనా వంద మంది దోషులను నిరపరాధులుగా తీర్పు ఇచ్చినను ఒక నిరపరాధిని దోషిగా తీర్పు ఇవ్వరాదు అనేది న్యాయం సారాంశం. •

## బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించిన జె.సి బ్రదర్స్



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 24 ప్రభాతవార్త
తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలిసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వానపత్రికలను సోమవారం స్థానిక జె.సి నివాసంలో మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని సత్కరించి వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు తిరుపాల్‌రెడ్డి, చంద్రమోహన్‌లు మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలకు అందచేసి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

## టిబి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి




ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, మార్చి 24 ప్రభాతవార్త
టిబి వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని డాక్టర్లు పేర్కొన్నారు. ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడిపత్రిలోని ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ కృష్ణవేణి, తాడిపత్రి మండలం తలారిచెరువు డాక్టర్ లావణ్య, డాక్టర్ కేశవనంద ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా టిబి సూపర్‌వైజర్ సునీల్ మాట్లాడుతూ టిబి వ్యాధిని త్వరగా గుర్తించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్‌వ్యాధిగ్రస్తులు గళ్ళ పరీక్షలు చేపించుకోవాలన్నారు. టిబి వ్యాధి సోకినా ఇంటిలోని వారందరూ గళ్ళ పరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకొని ముందు జాగ్రత్తగా టిబి రాకుండా మందులు వాడాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, చుక్కలూరు పిహెచ్‌సి సూపర్‌వైజర్ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి వర్ధంతి




కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగయ్య

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అగ్రనాయకుడు, పోరాటాల వీరుడు ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి సొంత భూములు కూడా త్యాగం చేసిన మహా నాయకుడు వి.కె.వెంకటరామిరెడ్డి 2వవర్ధంతిని సోమవారం యాడికి మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి రంగయ్య, సిపిఐ తాడిపత్రి పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే వేములపాడులోని స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు, మార్చి 24 ప్రభాతవార్త



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమ వారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 75 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి సుబ్బయ్య, టి.ఆంజనేయస్వామి, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీచక్రభీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



పెద్దపప్పూరు, మార్చి 24 ప్రభాతవార్త
మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు బాలుస్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీఅశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు అశ్వత్థానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## గాలివానకు పండ్ల తోటల రైతులకు భారీ నష్టం

యాడికి, మార్చి 24, (ప్రభాతవార్త)
యాడికి మండలంలో ఇటీవల గాలి వాన బలంగా రావడంతో పండ్ల తోటల రైతులు భారీగా నష్టపోయారు. శనివారం అకస్మాత్తుగా గాలి రావడంతో పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాడికి, వి కొట్టాలపల్లి, వేములపాడు,రాయల్ చెరువు, ఉప్పలపాడు, పిన్నేపల్లె తదితర గ్రామాల్లో సపోటా, మామిడి, నిమ్మ, అరటి తదితర పండ్ల తోటలు, ఇతర పంటలు కూడా నష్టపోయినట్టు బాధిత రైతులు చెబుతున్నారు.. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతుల వినియోగించుకుంటున్నారు.

## దెబ్బతిన్న పండ్లతోటలను పరిశీలించిన ఆర్డీఒ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఒ కేశవనాయుడు

పుట్లూరు, మార్చి 24 ప్రభాతవార్త
అకాల వర్షం వల్ల మండలంలో దెబ్బతిన్న పండ్లతోటలను సోమవారం ఆర్డీఒ కేశవనాయుడు పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న, పడిపోయిన అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఒ మాట్లాడుతూ నష్టంనఅంచనా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపడం జరుగుతుందని ఆయన తెలియచేశారు. ఆయన వెంట మండల తహశీల్దార్ శేషారెడ్డి, ఇతర అధికారులు వున్నారు.

## పంచముఖ కవచాలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రిటౌన్, మార్చి 24 ప్రభాతవార్త




తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం పంచముఖ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని బిల్వపత్రాలతో పాటు వివిధ రకాల పూలమాలలతో, పంచముఖం కవచంతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు చంద్రమోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన బాణా నాగేశ్వర్‌రెడ్డి




నివాళులు అర్పిస్తున్న బాణా నాగేశ్వర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 24 ప్రభాతవార్త
యర్రగుంటపల్లికి చెందిన అవ్వ ఆదిరెడ్డి సతీమణి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి పట్టణ శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయ మాజీ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి సోమవారం యర్రగుంటపల్లిలో వారి స్వగృహంకు వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## ఐపిఎల్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

నంబులపూలకుంట, మార్చి 24 ప్రభాతవార్త



ఎస్సై వలి బాషా

ప్రస్తుతం ప్రారంభమైన క్రికెట్ మ్యాచ్‌లకి ఎవరైనా బెట్టింగులు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వలిబాషా సోమవారం విలేకరితో మాట్లాడుతూ.. క్రికెట్ అభిమానులు ఆటను చూసి ఆనందించాలి గాని బెట్టింగులకు డబ్బులు పోగొట్టుకొని చేసేది ఏమీ లేక అప్పుల పాలై ప్రాణాలు కోల్పోవడం సంఘటనలు ఎన్నో మనం చూస్తున్నామన్నారు. అలాగే మీ తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు ఎదగాలని ఎన్నో కలలుగంటున్న తల్లిదండ్రులకు అడియాసలు చేసుకోకూడదు కుటుంబ సభ్యులతో స్నేహితులతో ఆటను చూసి ఆనందించాలి తప్ప చెడిపోవద్దని మండల యువతులకు దిశ నిర్దేశం చేశారు.

## అశ్వవాహనంపై శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి

యల్లనూరు, మార్చి 24 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఉదయం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణస్వామికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు అశ్వవాహనంపై మెయిన్‌బజార్, కోటవీధిలో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు, మార్చి 24 ప్రభాతవార్త
పుట్లూరు మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. ఇందులో భాగంగా 6వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు పాఠశాలలో 7,8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులు స్వీకరణకు ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు వుందన్నారు. అనాధలు, బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే ఇందుకు అర్హుల న్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియచేశారు.

## సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులు

నంబులపూలకుంట, మార్చి 24 ప్రభాతవార్త
సోమవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద విద్యుత్ ట్రాన్స్ఫారం కాలిపోవడంతో స్థానములో కొత్త విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడం జరిగింది. ట్రాన్స్ఫారం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించి ఎమ్మార్వో కార్యాలయం నుండి ఇందిరాకాలనీ వరకు విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉండే చెట్లు కొమ్ములు తొలగించడం జరిగింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్ళ కంచెను ఏర్పాటు చేస్తే ప్రమాదంలో జరగకుండా ఉంటుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పూజారి రామ్మోహన్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



పూజారి రామ్మోహన్‌ను పరామర్శిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్ మార్చి 24 ప్రభాతవార్త
రాప్తాడు నియోజకవర్గం రూరల్ మండలం సిండికేట్ నగర్ గ్రామానికి చెందిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూజారి రామ్మోహన్ కాలు కి దెబ్బ తగలడంతో చికిత్స చేయించుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు..విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే,నియోజకవర్గం సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పూజారి రామ్మోహన్ ను ఆయన నివాసానికి జడ్పిటిసి, మండల స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అమడగూరు, మార్చి 24 ప్రభాతవార్త
అమడగూరు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఏ.రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు టి.నాగభూషణ, ఉపాధ్యక్షులు ఏ.అంజనప్ప, మండల నాయకులు మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణమాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితంగా ఎస్‌సి వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత లభించిందన్నారు. అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి తీర్మానం చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారితో పాటు మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అమడగూరు సర్పంచు షబ్బీర్, బిజెపి మండల అధ్యక్షులు వేమనారాయణ, మాజీ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి రామకృష్ణ, గౌరవ సలహాదారులు కె.గంగాధర్, టిడిపి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఉత్తన్న, నాగరాజు, జి.నరసింహులు, గంగులప్ప, ఓబులేసు, యువసేన నవీన్, రవిచంద్ర, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

## సంత వేలం దక్కించుకున్న భజంత్రి మూర్తి



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

అమడగూరు, మార్చి 24 ప్రభాతవార్త
అమడగూరు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అమడగూరు సంత వేలంపాటను అమడగూరుకు చెందిన భజంత్రీమూర్తి 51 వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది మార్చి నుండి 2026 ఫిబ్రవరి వరకు సంబంధించి వేలంపాటను సొంతం చేసుకున్నాడు. మండలంలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలికోట చెరువు వేలం ప్రస్తుతం పెండింగ్‌లో వుందని స్థానిక సర్పంచ్ షబ్బీర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి నసీమా, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మమత, సచివాలయంన వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, సురేందర్‌రెడ్డి, ఆదినారాయణ, గంగులప్ప, శివ, డైమండ్ అంజి, గంగాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## చింతా శరత్‌కుమార్‌రెడ్డికి ప్రకృతి రత్న అవార్డు



చింతా శరత్‌కుమార్‌రెడ్డి

అమడగూరు, మార్చి 24 ప్రభాతవార్త
అమడగూరు మండలం తుమ్మల పంచాయతీ వెంకటనారాయణపల్లి గ్రామానికి చెందిన బిజెపి కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి ప్రకృతి రత్న అవార్డుకు ఎంపికయ్యారు. నేచర్ ప్రొటెక్షన్ ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రమోషన్ కార్యక్రమంలో ప్రముఖ సేవలు అందించిన చింతా శరత్‌కుమార్‌రెడ్డికి మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో ఈ అవార్డును అందచేయనున్నారు. ప్రకృతి పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలిచిన చింతా శరత్‌కుమార్‌రెడ్డిని ఈ అవార్డు ద్వారా గౌరవించనున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు నాగరాజు మాట్లాడుతూ శరత్‌కుమార్‌రెడ్డి సహజ వృక్ష వ్యవసాయం, ప్రకృతి రక్షణపై చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ అవార్డు ద్వారా అటువంటి గొప్ప సేవలను ప్రోత్సహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## శ్రీవారి హుండీ లెక్కింపు

కదిరి, మార్చి 24 ప్రభాతవార
ప్రముఖప్రసిద్ధి గాంచిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ వెండితండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీవారి హుండీ లెక్కింపు సందర్భంగా మొత్తం రూ.82,64,892 వచ్చిందని బంగారం 12 గ్రాములు, వెండి 302 గ్రాములు కలదన్నారు. విదేశీ కరెన్సీ యుఎస్‌ఎ డాలర్స్ 21, కెనడ 20, ఆస్ట్రేలియా 20, ఓమన్ కంట్రీ 7 రియాల్స్ వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి ప్రసాద్, కెనరాబ్యాంకు మేనే జర్ అనంత బాబు, బ్యాంకు సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న భక్తులు

## కందికుంట కడిగిన ముత్యం

- వైసిపి నాయకుల వ్యాఖ్యలపై టీడీపీ మైనార్టీ నాయకులు ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మైనార్టీ నాయకులు

కదిరి, మార్చి 24 ప్రభాతవార్త
ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కడిగిన ముత్యమని ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే నాలుక కోస్తామని వైసిపి నాయకుల వ్యాఖ్యలపై తెలుగుదేశం మైనార్టీ నాయకులు ఫైర్ అయ్యారు. సోమవారం వైసిపి నాయకులు చేసిన అసత్య ఆరోపణలను టిడిపి మైనార్టీ నాయకులు తీవ్రంగా కండించారు. స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ రాష్ట్ర మహిళా సభ్యురాలు పర్వీన్‌బాను, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, నాయకులు కెఎస్.బావుద్దీన్‌లు మాట్లాడుతూ.. వైసిపి నాయకులపై కిడ్నాప్ కేసులో ఆరోపణలు వచ్చినందున పోలీసులు విచారణకు పిలవడం తప్పా అని వారు ప్రశ్నించారు. తప్పుడు కేసులకు మీపై ఆరోపణలు, కేసులు నమోదైనా ప్రతిసారి మతాన్ని అడ్డుపెట్టుకోవడం ఏంటని నిలదీశారు. గత వైసిపి ప్రభుత్వంలో తమపై తప్పుడు కేసులు బనాయించి లాఠీలతో కొట్టించినప్పుడు తాము మైనార్టీలు అన్న విషయం గుర్తుకు రాలేదా అని వైసిపి నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి దినం ఎమ్మెల్యే వెంకట ప్రసాద్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు వేలాది మంది మైనార్టీలు హాజరవడంతో దీనిని జీర్ణించుకోలేక వైసిపి నాయకులు తప్పుడు ఆరోపనలు చేస్తున్నారని తమ ఎమ్మెల్యే కందికుంటపై పెట్టిన తప్పుడు కేసుల్లో ఇప్పటికే న్యాయస్థానాలు కడిగిన ముత్యంలా తన నిర్దోషితత్వాన్ని ఎమ్మెల్యే నిరూపించుకున్నారన్నారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే నాలుక కోస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ ఖాదర్ బాషా, అక్రమ్‌మౌలానా, నాయకులు హైదర్, ఇనాయత్‌లు పాల్గొన్నారు.

## పాఠశాలలో అభివృద్ధి పనులకు సర్పంచ్ శ్రీకారం



పాఠశాలలో అభివృద్ధి పనులు చేస్తున్న దృశ్యం

కంబదూరు, మార్చి 24, ప్రభాతవార్త
కంబదూరు మండలం లోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవసరాల దృష్ట్యా, మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీటి కోసం ఆ గ్రామ సర్పంచి సంధ్యా హరినాథ్ 50 వేల రూపాయల పంచాయతీ నిధులను వెచ్చించి పైపు లైన్ వేయించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ,హెచ్చు తగ్గులు లేకుండా చదును చేయించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచి సంధ్యా హరినాథ్ కు ఆ పాఠశాల సిబ్బంది ,విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## ప్రధానోపాధ్యాయులు మురహరి మృతి

గుమ్మఘట్ట మార్చి 24 ప్రభాతవార్త
పదవ తరగతి పరీక్ష లు జరుగుతున్న సమయంలో ఓపెన్ స్కూల్లో మొదటి రోజైన హిందీ పరీక్ష రోజు పేపర్ బండిల్స్ పరీక్షల పరీక్షలకు ర్లను పోలీస్ స్టేషన్ నుండి పాఠశాలకు తీసుకొస్తుండగా మిస్ చేయడం జరిగింది. బలవంతంగా పరీక్ష నిర్వహించడానికి తప్పుడు మార్గాలలో బలవంతంగా తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ప్రశ్నాపత్రాలను వేరే పాఠశాలలో ఉన్న చీఫ్ నుండి అడగడం జరిగింది జిల్లా పరీక్షల విభాగం అధిపతి గోవింద నాయక్ మరొక సెంటర్ నుంచి హిందీ పేపర్ ని తెప్పించి బండిల్స్ మిస్ అయినా సెంటర్లో పరీక్ష రాయించడం జరిగింది హిందీ పేపర్లు అడ్జస్ట్ చేసినటువంటి పాఠశాలలో చీఫ్ అయినటువంటి వారి మీద జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎంక్వయిరీ కి వెళ్లి నీవే బాధ్యత వహించాలని బెదిరించడం వలన ఈరోజు ఉదయం గుండెపోటుతో ఆ ప్రధాన ఉపాధ్యాయుడు మురహరి మరణించడం జరిగింది . ఈయన చావుకు జిల్లా పరీక్షలు విభాగం అధిపతి బాధ్యత వహించాలి వీటిపై సమగ్ర విచారణ జరిపించి బాధితులపై చర్యలు తీసుకొని ప్రధానోపాధ్యాయిని కుటుంబాన్ని కాపాడాల్సినదిగా ఆర్ ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు తెలిపారు.

## సచివాలయ సిబ్బంది విధులకు సరైన సమయానికి రావడం లేదు

గుమ్మఘట్ట మార్చి 24 ప్రభాతవార్త
గుమ్మగట్ట మండలంలోని గ్రామా వార్డు సచివాలయాల సిబ్బంది ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్దేశించిన సమయం 9 గంటల నుండి 10 అయితే సిబ్బంది మాత్రం చాలా నిర్లక్ష్యం వహిస్తూ సమయానికి రాలేకపోతున్నారు దీనివల్ల కూలీ ఇతర పనులు చేసుకునేవాళ్లు సామాన్య ప్రజలు తమ అవసర నిమిత్తం సచివాలకు వెళ్లాల్సి వస్తే రోజంతా వేచి ఉండాల్సి వస్తుంది కనుక సచివాలయ సిబ్బంది సమయానికి వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా, అలాగే సామాన్య ప్రజలు ఎవరైనా సచివాలయానికి వెళితే వారి పట్ల కూడా పట్టించుకోని పరిస్థితి ఉంది.. ఈ విషయంపై మండల ఎమ్మార్వో వినతి పత్రం ఇవ్వడం జరిగింది... ఈ కార్యక్రమంలో గుమ్మగట్ట మండల ఇంచార్జి లీ. సతీష్ మాదిగ.. నియోజకవర్గం సమన్వయకర్తలు పిఆర్ పెన్నప్ప మరియు సిరిగే దొడ్డి తిప్పేస్వామి ఎంఆర్పిఎస్ నాయకులు కలుగోడు రాము.. భీమరాజు... సురేష్..మహేష్.. తదితరులు పాల్గొన్నారు.

## 21 లీటర్లు నాటు సారా స్వాధీనం

కళ్యాణదుర్గం రూరల్ మార్చ్ 24 ప్రభాతవార్త
ఎక్సైంజ్ ఇన్స్పెక్టర్ సిబ్బందితో కలిసి నాటు సారా నిర్మూలన కొరకు ప్రభుత్వం నిర్ణయించిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున పి గోవింద నాయక్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతను వద్ద నుంచి 21 లీటర్ల నాటు సారాయి ని మరియు 30 లీటర్ల నాటు సారాయి వండుటకు పనికి వచ్చు ఊటను ధ్వంసం చేసి నాటు శారాని తదుపరి చర్య నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు మేరకు పి గోవింద నాయక్ వయస్సు 44 తండ్రి పేరు పి నా రాయణ నాయక్ కళ్యాణదుర్గం మండలం కాపర్లపల్లి గ్రామం కళ్యాణదుర్గం ఎక్సైజ్ అధికారులు సదరు ముద్దాయి పైన కేసు నమోదు చేసి రిమాండ్ కి పంపడం జరిగినది ఈ దాడులలో ఎక్సైంజ్ ఇన్స్పెక్టర్ హసీనా భాను, ఏం సుధాకర్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఐ పిరు నాయక్ , రామానుజులు ,హెడ్ కానిస్టేబుల్, ఏం నరసరాజు, ప్రతాప్, ఇమ్రాన్ కానిస్టేబుల్స్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

## ధర్మవరంలో మహిళ అదృశ్యం..!

ధర్మవరం,మార్చి 24(ప్రభాతవార్త)



రూప

పట్టణంలోని రాంనగర్ కు చెందిన రూప కనిపించలేదని అత్త రమణమ్మ పిర్యాదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సోమందెపల్లి నుంచి రూప, తన భర్తతో కలిసి ధర్మవరంకు వారం రోజులక్రితం వలసవచ్చి మగ్గం నేసుకుంటు జీవనం సాగించేవారు. అయితే భార్య,భర్తల మధ్యచిన్నచిన్నగొడవల వల్ల మనస్థాపానికి గురైన రూప ఈనెల 14వ తేదీనుంచి ఇంటినుండి బయటకు వెళ్లింది. । అప్పటి నుంచి ఇంటికికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికిన ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో రూప అత్త రమణమ్మ సోమవారం పిర్యాదు చేసింది.దీంతో ఆమె పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు.

# కుంటిమద్దిలో కార్డెన్ సెర్చ్

రామగిరి, మార్చి 24 ప్రభాతవార్త



కుంటిమద్దిలో ఓ ఇంటిలో సోదాలు చేస్తున్న సిఐ, పోలీసులు

మండలంలోని కుంటిమద్ది గ్రామంలో రామగిరి సిఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారు జామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. చెన్నే కొత్తపల్లి, రామగిరి పోలీసులతో కలిసి ఆయన గ్రామంలోని ఇరుపార్టీల నాయకుల ఇళ్లల్లో సోదాలు చేశారు. గ్రామం బయట గడ్డివాములలోనూ, పొలాల్లో కూడా సోదాలు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు నెలకొల్పేందుకు పోలీసులు ఈ సోదాలు నిర్వహించారు. గ్రామంలో ప్రశాంతత ఉండాలని, ఎలాంటి కక్షలు, కార్పణ్యాలు పెట్టుకోవద్దని సిఐ శ్రీధర్ గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఏ చిన్న గొడవ జరిగిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏవైనా తగాదాలు ఉంటే పోలీసులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రిసర్వేకు సహకరించండి-తహసీల్దారు

అమరాపురం మార్చి 24 ప్రభాతవార్త



మాట్లాడుతున్న తహసిల్దార్ లక్ష్మీనరసింహ

మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామమునందు సోమవారం గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత రీ సర్వేప్రారంభభంపై గ్రామసభ మరియు ర్యాలీని తహసీల్దార్ లక్ష్మీనరసింహం అధ్వర్యంలో నిర్వహించినారు. ఈ కార్యక్రమం నందు సర్పంచ్ లోకేష్ డిప్యూటీ తహసిల్దార్ రాంభూపాల్ రెడ్డి, రెవెన్యూఇన్స పెక్టర్ విన్సెంట్ పాల్, మండల సర్వేయర్ పుట్టరాజు, గ్రామకార్యదర్శి ఈరన్న, విఆర్ఓరవి తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు, రైతులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత రీసర్వే పనులకు సహకరించాలని ఆయన కోరారు. రీ సర్వే ద్వారా రైతులకు తమ భూములకు సంబంధించిన సమస్యలతో పాటు రికార్డుల పరంగా ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం నందు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మవరంలో తాగునీటికోసం రోడ్డెక్కిన కాలనీవాసులు...!

### గంటపాటు రోడ్డుపై నిరసన

### మున్సిపల్ కమిషనర్ హామీతో విరమణ...!

ధర్మవరం, మార్చి24(ప్రభాతవార్త)



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

వేసవి ఆరంభం లోనే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. తాజాగా ధర్మవరం పట్టణంలో తాగునీటి కోసం కేతిరెడ్డికాలనీ, ఎల్4 కాలనీ వాసులు రోడ్డెక్కారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్4 లో గత పది రోజులకు పైగా తాగునీరు సరఫరా కాలేదంటూ సోమవారం ఉదయం రోడ్డుపై నిరసన చేపట్టారు. తాగునీరు కాలేదని పలు మార్లు మున్సిపల్ డీఈకి విన్నవించామని, అయిన పట్టించుకోలేదని వారు ఆవేదనవ్యక్తం చేశారు. తాము ఉదయమే కూలి పనులకు వెళ్తామని తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని, తాగునీటి కోసం పక్కకాలనీకి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కాలనీలో కొన్నిప్రాంతాలకు పైపులైన్ ఉందన్నారు. కూలిపనులు వదిలేసి తాగునీటికోసమే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతందన్నారు. ఈ నిరసన దాదాపు గంట పైగా జరగడంతో ట్రాఫిక్ స్తంబించిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ నిరసన చేస్తున్న ప్రాంతానికి వచ్చికాలనీ వాసులతోమాట్లాడారు... సమస్యను అడిగితెలుసుకున్నారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ... పైపులైన్ పనులు చేస్తుండటం వల్ల సమస్య తలెత్తిందని, తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు నిరసన విరమించారు.

## కనిపించకుండా పోయిన ఇంజనీరింగ్ విద్యార్థినీ

బత్తలపల్లి, మార్చి 24 ప్రభాతవార్త

సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థినీ మూడు రోజులుగా కనిపించకుండా పోయినట్లు విద్యార్థినీ తల్లిదండ్రులు బత్తలపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన నాగభూషణ కుమార్తె అనంతపురం పట్టణంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నట్లు తెలిపారు. శనివారం ఇంటి వద్ద నుంచి రామాపురం కూడలిలో సర్టిఫికెట్లును జిరాక్స్ చేయించుకునేందుకు ఇంట్లో చెప్పి వెళ్లినట్లు తెలిపారు. ఆ తరువాత ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల ఇంట్లోను విచారించుకుని కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. సోమవారం తల్లిదండ్రులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

## పది పరీక్షల్లో అలసత్వం ప్రదర్శించిన టీచర్లకు సోకాస్ నోటీసులు

### ఒక విద్యార్థినీ డిబార్ ఆ సెంటర్లలో నూతన ఇన్విజిలేటర్లు, చీప్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లను ఏర్పాటు

కొత్తచెరువు మార్చ్ 24 ప్రభాతవార్త.

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సోమవారం జరిగిన గణిత పరీక్షలో ఇన్విజిలేటర్లు గా వ్యవహరించిన టీచర్లు అలసత్వం ప్రదర్శించడంతో ఆ టీచర్ల కి షోకాజ్ నోటీసులు చారీ చేయడం జరిగిందని డీఈవో జి కృష్ణప్ప తెలిపారు శ్రీ సత్యసాయి జిల్లా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు లో సోమవారం గణిత పరీక్ష జరిగింది రాష్ట్ర పదవ తరగతి పరీక్షల పరిశీలకులు జాయిన్ డైరెక్టర్ సుబ్బారావు కదిరి సెంటర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల లో సందర్శించారు ఈ పాఠశాలలో ఇన్విజిలేటర్ గా విధులు నిర్వహిస్తున్న కే రుద్రమ రెడ్డి ఎస్ జి టీచర్ నడింపల్లి కదిరి మండలం, డి కృష్ణప్ప ఎస్జీ టీచర్ మున్సిపల్ ప్రైమరీ హై స్కూల్ సైదాపురం కదిరి మండలం పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు ఆ ఉపాధ్యాయులకు డీఈవో జికృష్ణప్ప సోకాస్ నోటీసులు జారీచేశారు మహమ్మద్ రఫీ ఎస్జిటీచర్ ముదిగుబ్బ ఎంపిపి ఎస్ న్యూటన్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి నీ డిబార్ చేశారు ఇన్విజిలేటర్ అలసత్వంతో విధులు నిర్వహిస్తున్నందున సోకాస్ నోటీసులు జారీ చేసి సస్పెండ్ చేయడం జరిగింది కదిరి బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చీఫ్ సూపర్డెంట్లు డిపార్ట్మెంట్ ఆఫీసర్లను పదోతరగతి పరీక్షల విధుల నుంచి తప్పిస్తూ షోకాస్ నోటీసులు జారీ చేయడం జరిగిందని డీఈవో జి. కృష్ణప్ప తెలిపారు అలాగే కదిరి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ మరియు బి సెంటర్లలో ఓపెన్ స్కూల్ పరీక్షలలో విధులు నిర్వహిస్తున్న, చీప్ సూపర్డెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు ను పరీక్ష విధుల నుంచి తొలగించి కొత్తవారిని నియమించడం జరిగిందని డీఈవో తెలిపారు.

# రూ.13 కోట్లతో మున్సిపల్ వార్షిక బడ్జెట్

పెనుకొండ మార్చి 24 ప్రభాతవార్త



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సతీష్ కుమార్

పట్టణ మున్సిపల్ 20 25 2026 వార్షిక బడ్జెట్ ను 13,22,00,976 రూపాయలతో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ ఉమార్ ఫరూక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో కమిషనర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ 20252026 సంవత్సరం వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. తదనంతరం సాధారణ కౌన్సిల్ సమావేశం గురించి కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రమంత్రి సవిత ఆదేశాల మేరకుపట్టణంలో ప్రధాన రహదారుల సుందరీకరణ కోసం సాధారణ బడ్జెట్ నుండి లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి అందించిన ఎంపీ ల్యాడ్స్ పది లక్షల రూపాయల నుండి వీది దీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు మంత్రి ఎంపి ల ఆదేశాల మేరకు పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు మంత్రి ఎంపీలు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుండి నిధులు తీసుకొచ్చి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కౌన్సిల్ కోరింది మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండి వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా నివారించేందుకు వాటర్ ట్యాంకర్ల నుండి నీటిని అందించాలని కౌన్సిల్ ఆమోదించింది అదేవిధంగా పట్టణంలో పలు ప్రాంతాలలో పరిశుభ్రత నెలకొల్పడానికి పలు సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు కౌన్సిల్ ఆమోదించింది కౌన్సిల్ ఆమోదించింది .సమావేశంలో కౌన్సిలర్లు , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం. !

### కావలి బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం కావలి న్యాయవాదులు ఏకగ్రీవం

మడకశిర టౌన్ మార్చ్ 24 ప్రభాతవార్త

మడకశిర బార్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం మడకశిర పట్టణంలోని న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా అశ్వర్థ నారాయణ, ఉపాధ్యక్షులుగా కిష్టప్ప, సెక్రెటరీగా ఉమేష్ చంద్ర, జాయింట్ సెక్రెటరీగా దివాకర్, ట్రెజరర్గా నాగరాజు ,లైబ్రరీ ఇన్చార్జిగా రంగనాథ్, బార్అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, మడకశిర బార్ అసోసియేషన్ ఎలక్షన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాధాకృష్ణ, గోవర్ధన్ రెడ్డి, నారాయణ గౌడ్, పలారం లోకేష్, భాస్కర్, గోపాల్ రావు, న్యాయవాదులు, పాల్గొనడం జరిగింది,

## మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు

### గ్రామస్తుల సహకారంతో భద్రతకు కొత్త దిశ

విడపనకల్లు మార్చి 24 ప్రభాతవార్త



పోలీస్ స్టేషన్లో సీసీటీవీ ఫీడ్ను మానిటర్ చేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ ఖాజా హుస్సేన్

మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు విజయవంతంగా పూర్తయింది. ప్రజల సహకారంతో ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలైంది. మండల కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్కు అనుసంధానం చేశారు. ఈ ఏర్పాటు వలన మండల ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే అసాంఘిక చర్యలు, చోరీలు, శాంతిభద్రతల సమస్యలను తగ్గించేందుకు ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ ప్రాజెక్ట్ అమలులో స్థానిక గ్రామస్తుల సహకారం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మండలంలోని వివిధ సంఘాలు, వ్యాపారస్తులు, రైతులు, యువత కలిసి నిధుల సేకరణ చేపట్టి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సహాయంగా నిలిచారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, పంచాయతీ కార్యాలయం, బస్టాండ్, స్కూళ్లు, ఇతర జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కెమెరాలను అమర్చారు. ఈ చర్యలపై మండల పోలీస్ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. "సీసీ కెమెరాలు నేర నియంత్రణలో మాకు ఎంతో సహాయపడతాయి. ప్రజల భాగస్వామ్యంతో భద్రతను మరింత మెరుగుపరిచేందుకు మా ప్రయత్నం కొనసాగుతుంది అని సబ్ ఇన్స్పెక్టర్ ఖాజా హుస్సేన్ తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజలను కెమెరాల నిర్వహణలో సహకరించాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం మండల భద్రతను మెరుగుపరచడంలో మైలురాయిగా నిలుస్తుంది. ఇలాంటి చర్యలు అన్ని గ్రామాల్లో అమలైతే భద్రతా సమస్యలు చాలావరకు తగ్గుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

## అక్రమ మద్యం, నాటు సారా పై నిఘా పెంచండి

పుట్టపర్తి రూరల్ మార్చి 21 ప్రభాతవార్త :



సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు.

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం నాటు సారా తయారు చేయ కుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి అనంతపు రం జిల్లా డిప్యూటీ కమిషనర్ మరియు ఎక్సైజ్శాఖ అధికారి నాగముద్దయ్య పేర్కొన్నారు. సోమవారం నాగమద్దయ్య అధ్యక్షతన అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూప రింటెండెంట్ నరసింహులు సత్యసాయి జిల్లా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు, సబ్ఇన్స్పెక్టర్లుతో నేరసమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా నవోద్నయ 2.0లో భాగంగా ఏబిసి గ్రామాలను రివ్యూ చేయడం, నాటుసారా తయారీదారులపై నిఘాపెంచి తయారీదారులు అమ్మకం దారుల పై కేసులు నమోదుచేసి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, పాత నేరస్తుల ను గుర్తించి అనుమానితులను కూడా బైండోవర్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నాటుసారా తయారీకి కావలసిన బెల్లం అమ్మకం దారులను రవాణా దారులను బైండోవర్ చేయడం, నవోదయం 2.0 లో భాగంగా నాటుసారారహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల మద్యం చొరబడకుండా అరికట్టాలని సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలని శిస్తు కట్టని మద్యంఅమ్మకం దారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించడమైనది. జిసిఆర్ కేసులను, పెండింగ్ కేసులను త్వరితిగతిన ఇన్వెస్టిగేషన్ చేసి చార్జ్షీట్ ఫైల్ చేయడం, అదేవిధంగా మద్యం షాపులలో నిబంధనల ప్రకారం అమ్మకాలు జరపాలని ఇన్స్పెక్షన్స్ చేయాలని, ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలని కల్లు దుకాణాలలో కల్తీ జరక్కోకుండా నమూనాలు సేకరించాలని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు, పుట్టపర్తి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగరాజు శ్రీ సత్య సాయి జిల్లా ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో పూర్తి నివేదిక అందిస్తాం

### ఆర్టికల్చర్ అధికారిని అమరేశ్వరి.

తాడిమర్రి మార్చి 24 ( ప్రభాతవార్త )



గాలి వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారిని అమరేశ్వరి మరియు రెవిన్యూ అధికారులు

మండల పరిధిలోని దాడి తోట నాయనపల్లి తురక వారి పల్లి గ్రామాల పరిధిలో గత శనివారం రాత్రి గాలి వాన వడగళ్ల బీభత్సానికి పంట నష్టం ఒక రోజులో అంచనా వేయడం కుదరదని ప్రతి ఒక్క రైతుకి న్యాయం జరిగేలా పంట నష్టం అంచనాలను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం. వర్షం గాలి వడగళ్ల దాటికి అరటి, మొక్క జొన్న, టమోటా, దానిమ్మ పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆర్టికల్చర్ అధికారిని అమరేశ్వరి తెలిపారు. సోమవారం సంబంధిత గ్రామాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంటలు దెబ్బతిన్న రైతులను కలిసి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలను కోల్పోయిన రైతుల వద్ద పూర్తి సమాచారం సేకరించి రెండు రోజులలో పంట నష్టం పై నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని అన్నారు. పంటలు కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందే విధంగాప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. పంట నష్టపోయిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, వన్ బి, బ్యాంక్ అకౌంట్, ఒక కలర్ పాస్ ఫోటో, తో పాటు రైతు సాగు చేసిన పంట వివరాలను జతపరిచి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రాజకుల్లయప్ప కన్నప్ప సచివాలయ ఆర్టికల్చర్ సిబ్బంది రామాంజనేయులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ గౌతమి తో పాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

## నేడే ఎంజెపి ప్రవేశ పరీక్షల దరఖాస్తులకు చివరితేదీ



ప్రిన్సిపాల్ ప్రసాద్

గుడిబండ మార్చి 24 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు నేడు మంగళవారం ఆఖరు తేదీ అని గుడిబండ ఎంజెపి కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 26 విద్యాసంవత్సరానికి 5,11వ తరగతులలో ప్రవేశాలకు అలాగే 6,7,8,9, మిగులు సీట్ల ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## నేడు బత్తలపల్లి మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి, మార్చి 24 ప్రభాతవార్త

బత్తలపల్లి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. కావున మండలంలోని ప్రజా ప్రతినిదులు అందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. అదేవిధంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

## నేడు బహిరంగవేలం

చిలమత్తూరు, మార్చి 24 ప్రభాతవార్త

చిలమత్తూరు గ్రామ పంచాయతీకి సంబంధించి వారపుసంత, బస్టాండ్, జంతువధశాలకు సుంకం వసూలు చేసుకునే హుక్కు, షాపింగ్ కాంప్లెక్స్ భూముల్లో వ్యాపారాలు నడుపుకొను హక్కుకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం ఉదయం 11 గంటలకు చిలమత్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచు అధ్యక్షతన బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సావిత్రి తెలిపారు. ఇందులో భాగంగా వారపుసంతకు సంబంధించి 50 వేల రూపాయలు, బస్టాండ్కు సంబంధించి 50 వేలు, జంతువధశాలకు సంబంధించి 5 వేలు, షాపింగ్ కాంప్లెక్స్ రూములకు సంబంధించి 50 వేలు, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులములకు సంబంధించి రూమ్ నెంబర్ 5కు సంబంధించి 10 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కార్యదర్శి తెలియచేశారు.

## నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు ఎర్ర బ్యాడ్జిలతో నిరసన



ఎర్ర బ్యాడ్జిలతో నినాదాలు చేస్తున్న ఆర్టీసి కార్మికులు

మడకశిర మార్చి 24 ప్రభాతవార్త;

డిపోలో నెలకొన్న అనేక సమస్యలపై మరియు అక్రమ సస్పెన్షన్లు జరగడం అన్యాయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ సభ్యులు యజమాన్యంకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. అందుకు నిరసనగా సోమవారం ఎర్రబ్యాడ్జిలు ధరించి విధులు నిర్వహిస్తామని తెలియజేశారు.

## న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా అశ్వర్థనారాయణ

మడకశిర మార్చి 24 ప్రభాతవార్త;



ఎన్నికైన నూతన బార్ అసోసియేషన్ సభ్యులు

న్యాయవాదుల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికలలో అధ్యక్షుడిగా కె. అశ్వర్థనారాయణ, ఉపాధ్యక్షుడి గా హెచ్. ఎన్. కిష్టప్ప, సెక్రెటరీగా కేసి. ఉమేష్చంద్ర, జాయింట్ సెక్రెటరీగా ఎన్. దివాకర్, కోశాధికారిగా నాగరాజు, మరియు లైబ్రెరీ ఇంఛార్జ్గా రంగనాథ్ లను బార్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం అధ్యక్షుడు అశ్వర్థనారాయణ మాట్లాడుతూ కక్షిదారులకు న్యాయం చేయడమే తన లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. అలాగే న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. న్యాయవాదుల సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పదో తరగతి పరీక్షల్లో ముగ్గురు ఇన్విజిలేటర్లకు షోకాస్ నోటీసులు ఒక విద్యార్థి డిబార్...

### డీఈవో జి కృష్ణప్ప పది పరీక్షల పరిశీలకులు రాష్ట్రజాయింట్ డైరెక్టర్ సుబ్బారావు కదిరి సెంటర్ సందర్శించారు

### గణిత పరీక్షకి 145 మంది విద్యార్థులు గైర్హాజరు

కొత్తచెరువు మార్చి 24 ప్రభాతవార్త.

శ్రీ సత్య సాయి జిల్లా లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పరిశీలకులు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు , డీఈవో జీ కృష్ణప్ప కదిరి బాలికల ఉన్నత పాఠశాలలో గణిత పరీక్షా కేంద్రంను పరిశీలించారు ఈ సందర్భంగా అక్కడ విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు టీచర్ల కి షోకాస్ నోటీసులు జారీ చేయడం జరిగిందని డీఈవో జి కృష్ణప్ప తెలిపారు. సత్య సాయి జిల్లాలో మొత్తం 104 సెంటర్లలో జరిగిన పరీక్షకి 21 629 మంది గణిత పరీక్షకి హాజరు కావలసి ఉండగా 21484 మంది విద్యార్థులు పరీక్షకి హాజరయ్యారు 145 మంది విద్యార్థులు పరీక్షకి గైర్హాజరయ్యారు హాజరు 99.33 శాతం గా నమోదు కావడం జరిగిందని ఏసి లాజర్ తెలిపారు.

# పిటీషన్లకు చట్టపరిధిలో న్యాయం చేయండి జిల్లా ఎస్పీ వి.రత్న

పుట్టపర్తి, మార్చి 24, ప్రభాతవార్త

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్)కు వచ్చిన పిటీషనర్లకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" ( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం ) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలమూలల నుండి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి 60 పిటీషన్లు స్వీకరించారు. సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు, డీఎస్పీలు విజయ్ కుమార్, ఆదినారాయణ , లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలి

### ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

పుట్టపర్తి టౌన్, మార్చి 24, ప్రభాతవార్త

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపి కాలువ వెడల్పు చేయాలని, లైనింగ్ పనులు చేపడితే రైతు సంఘం ఆధ్వర్యంలో యంత్రాలను పగులకొడతామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కార్మిక, కర్షక భవనంలో హంద్రీనీవా లైనింగ్ పనులు చేపట్టరాదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జంగాలపల్లి పెద్దన్న, జలసాధన ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘం (సిపిఐ అనుబంధం) జిల్లా నాయకులు మహదేవ, కాటమయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు గిరీష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లైనింగ్ పనుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. జీవోలు 404, 405 రద్దు చేయాలని పంట కాలువల నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం సంక్షోభంలో పడకుండా ఉండాలంటే సాగుభూమికి 30 శాతం నీటి వనరులు ఉండాలన్నారు. జాతీయ ఇరిగేషన్ కమిషన్, జయతి ఘోష్ కమిషనర్, స్వామినాథన్ నివేదిక, రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ కమిషన్ నివేదికను ఇదే విషయాన్ని ప్రస్తావించాయన్నారు. వెడల్పు కోసం రైతులు రైతు సంఘాలు రాజకీయ పార్టీలు చేసిన ఆందోళన వల్ల 6300 సామర్థంతో కాలువ నిర్మాణం చేపడతామని, అందుకు 6,182 కోట్లు అవసరమని అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రకటించి నిధులు కేటాయిస్తామన్నారు. తరువాత వైసిపి ప్రభుత్వం లో కాలువ నిర్మాణ పనులు గురించి పట్టించుకోలేదన్నారు. రాయలసీమ వెనుకబాటు తనాన్ని, గుర్తించి భూగర్భ జలాలు అడుగంటి పోయే లైనింగ్ పనులు ఆపి, కాలువ వెడల్పు పనులు చేసి రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో రైతుల అగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది.

కనేకల్లు, మార్చి 24 ప్రభాతవార్త:

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి అని మెడికల్ డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సోమవారం కనేకల్లు ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సిబ్బందిఏ క్షయ వ్యాధి నిర్మూలన చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని క్షయాటీబీ లాంటి వ్యాధులు భయంకరము కాదని వాటిని నివారించవచ్చని నినాదాలు చేస్తూ ర్యాలి నిర్వహించారు. గ్రామాల్లోనూ, పల్లెలోనూ ప్రజలకు అవగాహన కల్పించాలని క్షయవ్యాధి పట్ల ప్రతతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. టీబీ క్షయ వ్యాధినిఅంతం చేద్దాం, నిర్మూలిద్దాం అని హర్షవర్ధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, మెడికల్ హర్షవర్ధన్ సిస్టర్స్ సిద్దేశ్వరి, మరియు ఆశ వర్కర్స్ స్టాఫ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి..

### డాక్టర్ ప్రశాంత్ కుమార్..

చెన్నేకొత్తపల్లి, మార్చి, 24(ప్రభాతవార్త



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాలలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని డాక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు, సోమవారం చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్గేట్ పి. హెచ్. సి, పరిధిలోని బసంపల్లి గ్రామములో డాక్టర్ ప్రశాంత్కుమార్ ఆధ్వర్యం లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రజలకు, వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ బి.పి. ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు .అలాగే గర్బవతులకు పరీక్షలు చేసి అందరికి మందులు పంపిణీ చేయడం జరిగినది. మంచానికి పరిమితం అయినా కొంతమందికి వారి ఇంటిదగ్గర పరీక్షలు చేసి వారికీ కూడా మందులను పంపిని చేయడం జరిగినది. ఈ సందర్భంగా, డాక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గర్బిణీ స్త్రీలకు పలు సూచనలు సలహాలు ఇచ్చెను. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిసుబ్రాంగా ఉంచుకోని ఆరోగ్యం గా ఉండాలని చూసించెను. ఈ కార్యక్రమం లో సి హెచ్ ఓ, గోవిందమ్మా. ఎం ఎల్ హెచ్ పి. సాయి లీల, హెచ్ఏ , శ్రీనివాసులు. ఏఎన్ఎం, సుభాషిణి, 104 సిబ్బంది. నందిని, లక్ష్మి నరసమ్మ ,ఆశలు, పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 24-03-2025 PM 11:26 Page 1



## అదుపుతప్పి కొరియర్ వ్యాను బోల్తా

బత్తలపల్లి, మార్చి 24 ప్రభాతవార్త




అదుపు తప్పి బోల్తా పడిన వ్యాన్

జాతీయ రహదారిపై మండల పరిధిలోని బత్తలపల్లి బైపాస్ రోడ్డులో సోమవారం అదుపుతప్పి కొరియర్ వ్యాను బోల్తా పడింది. ప్రత్యక్షసాక్షులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి వైపు నుంచి అనంతపురం వైపుకు కొరియర్ వ్యాను వెలుతున్నట్లు తెలిపారు. బత్తలపల్లి బైపాస్ రోడ్డులో వేల్పుమడుగు క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాను కొద్ది దూరం వెళ్లి డివైడర్ను ఢీ కొని ఆగిపోయింది. వ్యానులో డ్రైవర్ ఒక్కడే ఉన్నట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. వ్యానును తీసుకువెళ్లినట్లు తెలిసింది.

## క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్న వైద్య అధికారులు...!

ధర్మవరం,మార్చి 24(ప్రభాతవార్త)



ర్యాలీనిర్వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది.

క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని డిప్యూటిడీ ఎంఅండ్ హెచ్ సెల్వియా సాల్మాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు వైద్యసిబ్బంది ప్రభుత్వాస్పత్రి నుండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టీబీ జబ్బు మైక్రో బ్యాక్టీరియాలు అనే క్రిమిద్వారా సంక్రమించి నోటి తుంపర్లు, గాలి ద్వారా వ్యాపిస్తుందన్నారు. రెండు వారాలు మించి తీవ్రమైన దగ్గు, ఆయాసం, బరుగు తగ్గడం, ఆకలిమందగించడం తదితర లక్షణాలుంటే ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా మమందులు కూడా ఇవ్వడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శినమల మెడికల్ ఆఫీసర్ఖిపుష్పలత శ్వేత. టీబీ యూనిట్ రహమత్బాషా, ఎరికలప్ప, బాలాజీనాయక్, ఆశాకార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మద్యాహ్నా భోజనం పరిశీలించిన తహసిల్దార్

అమరాపురం మార్చి 24 ప్రభాతవార్త



మద్యాహ్నా భోజనం పరిశీలిస్తూన్న దృశ్యం

మండల పరిధిలోని నిద్రగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డొక్క సీతమ్మ మధ్యాహ్నా భోజన పథకాన్ని తహశీల్దార్ లక్ష్మీనరసింహం సోమవారం పరిశీలించారు. ఈ సందర్బంగా పాఠశాలలో భోజనం పరిశీలించిన తహసిల్దార్ రుచిచూసినారు. నాణ్యమైన ఆహారంఅందించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఈరన్న, సర్పంచ్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో స్వీయరక్షణ శిక్షణా కార్యక్రమం

విడపనకల్లు, మార్చి 24 ప్రభాత వార్త :



ట్రైనర్, విద్యార్థినులకు ప్రాథమిక రక్షణ పద్ధతులు నేర్పిస్తున్న దృశ్యం.

విద్యార్థినుల భద్రత, అవగాహన పెంపుదల కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం , మాలాపురం లో స్వీయరక్షణ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ఆహ్వానించబడిన ప్రశిక్షకుడు విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులు నేర్పారు. ఈ శిక్షణలో ఆపద సమయంలో ఎలా స్పందించాలి, బలమైన ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి, సామాన్యరక్షణపద్ధతులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఈశిక్షణలో ఆసక్తిగా పాల్గొని ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు సబ్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు. వారు విద్యార్థినులకు సామాజిక భద్రత, మహిళల రక్షణ, పోలీస్ సహాయాన్ని ఎలా పొందాలి అనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, "ఇటీవలి కాలంలో మహిళల భద్రతపై మరింత శ్రద్ధ అవసరం. విద్యార్థినులు స్వీయరక్షణపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమైనది" అని సూచించారు. స్థానిక ప్రజలు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. వారు ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

## విద్యుతాఘాతంతో యువకుడు మృతి

### కొళాయి మోటర్ పెట్టేందుకు వెళ్లడంతో జరిగిన దుర్ఘటన

విడపనకల్లు మార్చి 24 ( ప్రభాత వార్త



మృతి చెందిన సుంకన్న ఫైల్ ఫోటో

అర్థాంతరంగా ఒక కుటుంబాన్ని కోల్పోయిన విషాద ఘటన మండలం లోని పాల్తూరు గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన సింగాడి సుంకన్న (25) కొళాయి మోటర్ అమర్చడానికి వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురయ్యి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సుంకన్న మృతి గ్రామాన్ని శోకసంద్రంలో ముంచివేసింది. మృతుడికి భార్య, నెల క్రితం ఇద్దరు కవలలకు జన్మనిచ్చారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ మార్గమైన ఆయన మరణంతో, కుటుంబ భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ బ్యాలా రాణీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గ్రామస్థులు, బంధువులు ఆయన కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఈ ఘటనపై అధికారుల దృష్టి మరల్చి, కుటుంబానికి తగిన ఆర్థిక సహాయాన్ని అందించాలనే డిమాండ్ గ్రామస్థులు చేస్తున్నారు.

## కొత్త బోర్లకు మోటారు పంపు సెట్టు

### - ఎంపిపి, సర్పంచు ఆధ్వర్యంలో నీటి సమస్యకు పరిష్కారం

అగళి, మార్చి 24 ప్రభాతవార్త



కొత్తబోర్లకు మోటాపు పంపు సెట్టును దింపుతున్న దృశ్యం

మండల పరిధిలోని ముకడాంపల్లిలో రెండు కొత్త బోర్లకు, జంగమర పల్లిలో ఒక కొత్తబోరుకు నూతనంగా మోటారు పంపుసెట్టును దింపడం జరిగింది. ఎంపిపి రేణుకా కామరాజు, సర్పంచు నరసింహమూర్తిల ఆధ్వర్యంలో నూతనంగా తవ్వించిన బోర్లకు మోటారు పంపు సెట్టలను బిగించారు. ప్రస్తుతం ఆ రెండు గ్రామాల్లో నీటి సమస్య లేకుండా సమస్యను పరిష్కరించినట్లు ఎంపిపి, సర్పంచు తెలిపారు. నీటి సమస్య పునరావృతం కాకుండా గట్టి చర్యలను తీసుకుంటున్నామని వారు తెలిపారు.

## సర్వేనంబరు 650 లో అక్రమాలపై... సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన...!

### పట్టాల పంపిణీ అంతా అక్రమాలేనన్న తహశీల్దార్ నటరాజ్...!



నిరసన చేస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం,మార్చి24(ప్రభాతవార్త)

ధర్మవరం పట్టణంలో పేదలకు ఇచ్చే పట్టాల పంపిణీలో ఎక్కడచూసిన అవినీతి అక్రమాలే కొట్టొస్తున్నట్టు కనిపిస్తున్నాయి. 650సర్వేనెంబరులో ఏకంగా యూనియన్ మాటున ముగ్గురు వ్యక్తులే కుటుం బసభ్యుల పేరుతోపట్టాలుపొందడం పట్టణంలో తీవ్ర చర్చనీయంశంగా మారింది.పేదలకు అందాల్సిన పట్టాలన్నీ కొందరికే పరిమితం కావడంతో బాదితులంతా ప్రజాసంఘాలను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. తాజాగా 6502 సర్వేనెంబరులో అర్హులకు పట్టాలు దక్కకపోవంతో బాదితులంతా ఏకమై సీపీఐ, వాటి అనుబంధ శాఖ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం పెద్దఎత్తున ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈ నిరసన గాంధీసర్కిల్ నుంచి



తహసీల్దార్తో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్రారంభమై ఎన్టీఆర్, కళాజ్యోతి,కాలేజ్ సర్కిళ్ల మీదుగా ఆర్టీసీ బస్టాండ్, సిరికల్చర్కార్యాలయ సర్కిల్ మీదుగా 6502 సర్వేనెంబర్ స్థలాల వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీకి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి, సీపీఐపట్టణ కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూ రమణ ఆధ్వర్యంలో ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా మద్యాహ్నం 1గంట సమయంలో వందలాది మందితో ఈ నిరసన జరిగింది. ఎక్కడైతే అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయో ఆ ప్రాం తానికి ర్యాలీగా వెళ్లడంతో పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నటరాజ్ అక్కడికి చేరుకుని ఆందోళన కారులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. ఇక్కడ జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నిగ్గుతేల్చడమే కాకుండా అసలైన ప్లంబర్స్కు న్యాయం జరిగేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని బీష్మించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ 650 సర్వేనెం 2 నెంబరులో 2024 ఫిబ్రవరి నెలలో పట్టాలు ఇచ్చారన్నారు.అయితే ఇందులో ఈ పట్టాలన్నీ పూర్తిగా అక్రమమని ప్రాథమికంగా తేల్చామన్నారు. రెవిన్యూ, నిబంధనల ప్రకారం నడుచుకోకపోవడమే కాకుండాకేవలం ఒకటి రెండు కుటుం బసభ్యులకే పట్టాలన్నీ చేయరాయన్నది మా విచారణలో తేలిందన్నారు. పట్టణ పరిదిలో ఒక సెంటు మాత్రమేఇవ్వాలని నిబంధన ఉందని, వాటిని సైతం తుం గలోకి తొక్కి ఎవరికి అనుగుణంగా వారు ఒకటిన్నర నుంచి మూడు సెంట్ల వరకు ఒక్కోపట్టా పొందారన్నారు. ఖాళీస్థలానికి ఫొజీషియన్ సర్టిఫికెట్ తీసుకోవడం కూడా చట్ట విరుద్ధమని ఆయన తేల్చేశారు. ఇందులో 76 మందికి పట్టాలు ఇవ్వగా 15 శాతం మంది ఇందులో అర్హులుగా ఉన్నారని మిగిలిన వారందరూ అనర్హులేనన్నారు. వీటిపై నివేధిక తయారు చేసి కలెక్టర్ నివేదించామన్నారు. ఈ నివేధిక రాగానే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు తమ నిరసనను విరమించారు. అనంతరం సీపీఐ నాయకులు ముసుగు మధు, జింకాచలపతి మాట్లాడుతు....ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో విచారించి నిజమైన ప్లంబర్స్కు న్యాయం జరిగేలా చూడాలని వారు అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రమణ, సకలరాజ, శ్రీనివాసులు, చెన్నంపల్లిశీన, హరి, శ్రీదర్,నాగేంద్ర, ప్లంబర్స్ అసోషియేషన్ నాయకులు గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, తాజ్, ఆంజనేయులు, మహిళాసమాఖ్య నాయకురాళ్లు లలితమ్మ, లింగమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మడకశిర బార్ అససియేషన్ కోశాధికారిగా నాగరాజు



అధ్యక్షులు కోశాధికారిని సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ మార్చి 24 ప్రభాతవార్త

మడకశిర బార్ అససియేషన్ కోశాధికారిగా గుడిబండ మండలంలోని సింగేపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది వి.నాగరాజు ను మడకశిర న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సింగేపల్లి నాగరాజు మాట్లాడుతూ నాకు కోశాధికారిగా అవకాశం కల్పించిన న్యాయవాదులకు, సహకరించిన సీనియర్ న్యాయవాది పలారం లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని,అలాగే నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఆశ్వర్తనాయణకు అభినందనలు తెలిపుతున్నానని అన్నారు.

## కేబినెట్ మరియు అసెంబ్లీ ఎస్సీ వర్గీకరణ తీర్మానంతో మా పిల్లల భవిష్యత్తుకు పునాదులు

### ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను సన్మానించిన బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి

రాయదుర్గం, మార్చి 24 ప్రభాతవార్త:

అసెంబ్లీ మరియు కేబినెట్లో ఎస్సీ వర్గీకరణ అంశంలో ఏ1 కేటగిరిలో చేర్చి మా కులానికి సంబంధించిన జేసి శర్మ కమీషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం పట్ల బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బలగల్ల నాగయ్య మాట్లాడుతూ కుల దృవీకరణ పత్రాలు లేక పిల్లల చదువులకు మరియు కుల అనుసంధానమైన ప్రభుత్వ పథకాలు అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో జేసి శర్మ కమిషన్ నివేదికను ఆమోదించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, డిప్యూటి సీఎం పవన్కళ్యాణ్కి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్కి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు ఆంధ్రప్రదేశ్ బేడా బుడగ జంగాల నాయకులు, ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బలగల్ల జమ్మన్న, పెద్ద బాలయ్య, మారేష్, సురేష్, శంకర్, వెంకీ, రవి,చిన్న, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి సభ్యులు.

## మధూడి పంచాయితీలో రీ సర్వే

అగళి, మార్చి 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని మధూడి పంచాయితీలో 25వ తేది నుంచి భూముల రీ సర్వే ప్రారంభించనున్నట్లు తహశీల్దారు సుబ్బారావు, ఆర్ఐ శేఖర్రావు తెలిపారు. రీ సర్వే ఉద్దేశ్యం రైతులకు సంబంధించిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి, హద్దులు సరిగా ఉన్నాయా లేదా, విస్తీర్ణం సరీగా ఉందా లేదా, రైతు సర్వే నెంబర్ ఒక చోట ఉంటే భూమి మరోచోట ఉండటం, భూమి లేనిచోట సర్వేనెంబర్ను చూపడం, హద్దులులేకపోవడం లాంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున భూముల రీసర్వే చేస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు. ఈ రీసర్వే చేసి పూర్తి అయిన అనంతరం రైతుల భూములకు సంబంధించి హద్దులు చూపడంతోపాటు రాళ్ల పాతుతామని, రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని తెలిపారు.

## క్షయ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న దృశ్యం

గుత్తి, మార్చి 24 ప్రభాతవార్త

ప్రాణాంతకమైన క్షయ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని, ప్రస్తుతం వున్న అధునాతన చికిత్స ద్వారా సులభంగా వ్యాధిని నివారించుకోవచ్చునని వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుండి గాంధీచౌక్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమ్యశ్రీ, ఆయేషా, అమర్నాథ్, హెడ్నర్స్ నాగమణి, సూపర్వైజర్లు దేవదాస్, ఖాజాబీ, హాండ్స్ సిబ్బంది రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి నీటి ట్యాంకు వితరణ

గుత్తి, మార్చి 24 ప్రభాతవార్త



నీటి ట్యాంకును అందచేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ వైద్యశాలకు సోమవారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్చౌదరి 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకును వితరణ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం కొరకు ట్యాంకు అందచేయడం పట్ల ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప ఆయనను అభినందించారు. దాతలు ముందుకు వచ్చి ప్రతి ఒక్కరూ తమవంతు సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జయరావు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### -తూనికలు, కొలతలశాఖ అధికారి వై.జి.శంకర్

గుంతకల్లు, మార్చి 24 ప్రభాతవార్త



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న తూనికలు, కొలతల అధికారి శంకర్

చిన్న చిన్న కిరాణా, తినుబండారాలు విక్రయించే వర్తకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అధికారి వై.జి. శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఇల్లూరి లక్ష్మినారాయణ భవన్లో వ్యాపారస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యాల దృష్ట్యా తినుబండారాల బాక్సులు, కవర్లపై తయారీ తేదీ, ముగింపు గడువు, చిరునామా, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ముద్రించాలని పేర్కొన్నారు. వాటిని కొనుగోలు చేసేటప్పుడు ఈ నిబంధనలకు లోబడి వుంటేనే కొనాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్యాకర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. తినుబండారాల తయారీలో కొంతమంది ఎక్కువ కలర్లు కలపడం గుర్తించామని, పిల్లల ఆరోగ్యలను దృష్టిలో వుంచుకొని ఇక మీదట వాటికి స్వస్తి చెప్పాలన్నారు. వ్యాపారస్తుల విజ్ఞప్తి మేరకు ఏప్రిల్ 15 వరకు గడువు ఇస్తున్నామని, అనంతరం నిబంధనలను పాటించకపోతే పెద్దఎత్తున జరిమానాలతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్తకుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపా జగదీష్, నాయకులు ఇల్లూరి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటల ఆక్రమణను అరికట్టాలి

### -సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీఒకు వినతి

గుంతకల్లు, మార్చి 24 ప్రభాతవార్త



ఆర్డీఒ శ్రీనివాస్కు వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

గుంతకల్లు నియోజకవర్గంలోని నీటి కుంటల ఆక్రమణను అరికట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఒ శ్రీనివాస్కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాముడాయల్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 42 చెరువులు, కుంటలు వున్నాయని పేర్కొన్నారు. గతంలో వర్షాలు ఎక్కువ కురవడంతో కుంటలు నిండి దాదాపు 5 ఎకరాలు సాగులోకి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కుంటల్లో నీరు లేనందున కొంతమంది వాటిని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు ఆక్రమణలకు గురవుతున్న కుంటలను గుర్తించి ముళ్లపొదలు, పూడికను తొలగించి రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, నాయకులు దాసరి శ్రీనివాసులు, గాజుల ప్రసాద్, గోపాల్, సయ్యద్బాషా, నూర్బాష, శివానంద, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ రూప

కంబదూరు, మార్చి 24, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధిం చి మిగిలిన సీట్ల భర్తీకి ఆన్ లైన్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ రూప ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. 6 తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కు 40, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కు 4 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. అర్హులైన వారు ఏప్రిల్ 11 వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## భార్య పై హత్యాయత్నం మరియు వేదింపుల కేసులో ముద్దాయికి 10 సంవత్సరాల జైలు శిక్ష..

పుట్టపర్తి, మార్చి 24, ప్రభాతవార్త

కట్టుకున్న భార్యపై హత్యాయత్నం, వేధింపులకు పాల్పడిన ముద్దాయికి 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు ఐదువేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ విరత్న తెలియజేశారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి గ్రామానికి చెందిన చాకలి సావిత్రి ను ముదిగుబ్బ మండలం కరావులపల్లి తండా గ్రామస్తుడైన చాకలి రాజశేఖర్తో 2016 సంవత్సరంలో పెళ్లిజరిగింది. పెళ్లితర్వాత రాజశేఖర్ సావిత్రి ఇద్దరు ముదిగుబ్బలో కాపురం పెట్టారు. ఆరు నెలల తర్వాత రాజశేఖర్ ఫిర్యాదిపై అనుమానం పెంచుకొని ఎప్పుడు తిట్టికొట్టి చంపుతాననిని బెదిరించి వేధించే వాడు, తర్వాత ఫిర్యాదిఅయిన సావిత్రి అతను పెట్టే వేధింపులు భరించలేక వెంకట గారి పల్లిలో వాళ్ల పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. అయినా కూడా ముద్దాయి నాలుగైదు సార్లు పుట్టింటికి వచ్చి ఇక్కడ కూడా తిట్టి కొట్టి చంపుతానని బెదిరింపుల పాల్పడినట్లు తెలియజేశారు. ఒకసారి వచ్చి ఇక్కడ ఆమెను తిట్టి కొట్టి బెదిరించడంతోపాటు ఫిర్యాది మామ అయిన ఓబులేసు యొక్క ఫోన్ తీసుకొని వెళ్లిపోయాడని, తర్వాత 11102017 తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాజశేఖర్ ఫిర్యాదికి ఫోన్ చేసి నేను అరటికాయ లోడు వేసుకొని డ్రైవింగ్ పని మీద పోతున్నాను నువ్వు వెంకట్ గారి పల్లి క్రాసులోకి వస్తే మీ మామ సెల్ ఫోన్ నీకు ఇస్తాను అని చెప్పడంతో ఫిర్యాది వాళ్ళ అమ్మ కు విషయం చెప్పి ఫిర్యాదుకు తోడుగా వాళ్ళ అక్క కొడుకు అయిన సాయి కృష్ణ , అతని స్నేహితుడు సాయికుమార్ మరియు ఫిర్యాదు బావ రాములను తోడు తీసుకొని సాయంత్రం 4:30 గంటల సమయంలో వెంకట గారి పల్లి క్రాస్ కు పోతూ ఉండగా అప్పటికే వంక దగ్గర కంపచెట్లలో నక్కి ఉన్న ముద్దాయి పరిగెత్తుకుంటూ వచ్చి నిన్ను చంపితే ఇప్పుడు నీకు దిక్కెవరు అని కత్తితో ఫిర్యాది ఎడమ భుజం వెనుక కుడిపక్క గొంతు కింద రెండు పోట్లు పొడిచేసరికి అంతలో ఫిర్యాది వెనకాల వస్తున్న సాయి కృష్ణ, సాయికుమార్, రాములను చూసి పారిపోయాడు. అప్పుడే అటువైపు వస్తున్న వెంకట గారి పల్లి గ్రామ సర్పంచ్ చిన్న రామప్ప అది చూసి 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి గాయపడిన సావిత్రి ని పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకొని పోయి వైద్యం చేయించడం జరిగిందన్నారు. 12102017వ తేదీన బాధితురాలు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ కేసులో అప్పటి పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ధనుంజయ, సెక్షన్ 498ఏ,307 ఐపిసి క్రింద ఎఫ్ఐఆర్ నెంబర్. 70/2017గా నమోదుచేశారన్నారు. అప్పటి సబ్ఇన్స్పెక్టర్ అయిన శాంతి లాల్, సమగ్ర దర్యాప్తు జరిపి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు ఋజువు కావడంతో ముద్దాయి చాకలి రాజశేఖర్కు 10 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష మరియు 5వేలజరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున సుజన బలమైన వాదనలు వినిపించినట్లు తెలియజేశారు.ఈ కేసులో సమగ్రమైన దర్యాప్తు జరిపిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు, ఏఎస్ఐ ధనుంజయ, అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ అయిన శాంతిలాల్, ట్రయల్ సకాలం లో జరగటానికి సహకరించిన పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కేఎం. లింగన్న మరియు సాక్షులను తీసుకు రావడంలో హెడ్ కానిస్టేబుల్ లు డి శివ మరియు మనోహర్ తదితరులను ఎస్పీ అభినందించారు.

## ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

### గోడపత్రాలను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్




వడదెబ్బపై అవగాహన గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము మార్చి 24 ప్రభాతవార్త:

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలపై అవగాహన కల్పించే గోడ పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలపై సూచనలు ఇచ్చారు. వడదెబ్బ లక్షణాల్లో తలనొప్పి, తలతిరుగుట, జ్వరం, అపస్మారక స్థితి వంటి సమస్యలు ఉంటాయని తెలిపారు. ప్రజలు తెల్లని పలుచటి దుస్తులు ధరించి, తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవాలని, మజ్జిగ, గ్లూకోజ్ నీరు వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో తిరిగిన తర్వాత చల్లటి పానీయాలు తీసుకోవాలని, తీవ్ర వేడి సమయంలో మధ్యాహ్నం 10 నుంచి సాయంత్రం 4 వరకు శారీరక శ్రమకు దూరంగా ఉండాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వారిని వెంటనే శీతల ప్రదేశానికి తరలించి, ప్రాథమిక చికిత్స కోసం దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఫైరోజా బేగం, డిపిఒ సమంత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలి

### -బిజెపి ఆధ్వర్యంలో అధికారులకు విన్నపం



మున్సిపల్ కమీషనర్కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

గుంతకల్లు, మార్చి 24 ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ నయీమ్అహమ్మద్, ఆర్డీఒ శ్రీనివాస్లకు వినతిపత్రాలను అందచేశారు. అనంతరం ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు వడ్డే రమేష్ మాట్లాడుతూ జనాభా పెరగడంతో ఆయా కులాల వారికి స్మశానవాటికలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణ శివారులోని ఎస్ఎస్ ట్యాంక్ వద్ద వున్న ప్రభుత్వ భూమి స్మశాన వాటికలకు సరిపోతుందా లేదా అని అధికారులు పరిశీలించాలని కోరారు. వినతి పత్రాలు అందచేసిన వారిలో నాయకులు నారాయణరెడ్డి, జెసి వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, కళావతి, తదితరులు వున్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం "హిందీ నరసప్ప" జీవితం



మాజీ ఎమ్మెల్యే హిందీ నర్సప్ప చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, మార్చి 24 ప్రభాతవార్త:

స్వాతంత్ర సమరయోధుడు కళ్యాణదుర్గం మాజీఎమ్మెల్యే హిందీ నరసప్ప నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని పలువురు వక్తలుపేర్కొన్నారు. సోమవారం స్థానిక చల్ల కాంప్లెక్స్లో ఏర్పాటుచేసిన 25వ హిందీ నరసప్ప వర్ధంతి కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు చల్ల రాజశేఖర్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హిందీ నరసప్ప చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమం రాయల వెంకటేశులు పూర్తి ఫౌండేషన్ నరసింహులు ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ తదితరులు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ప్రజాసేవకు అంకితమైన సేవలు అందించారని కొనియాడారు. స్వాతంత్రసమర సమయములో తొలి వ్యక్తి సత్యాగ్రహిగా హిందీ నర్సప్ప స్వాతంత్ర పోరాటం ఆచంద్ర తారకంగా నిలుస్తుందని అన్నారు. హిందీ నరసప్ప స్ఫూర్తిని నేటి యువతరం పూర్తిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు కిషోర్ కుమార్ విశ్రాంత ఆంగ్లఉపన్యాసకులు మల్లికార్జున ఓబులరాజు హిందీ నరసప్పఅల్లుడునారాయణ కూతుళ్లు సుమిత్ర,సావిత్రి,గౌతమి బంధుమిత్రులు పాల్గొని హిందీ నరసప్పకు ఘనంగా నివాళులు అర్పించారు.

25-3pg10.qxd:25-3pg10.qxd 25/03/25 10:06 PM Page 1



# ముంబై ఇండియన్స్ పడి లేచేనా?



## కెప్టెన్స్ మారినా మారని అదృష్టం
## 13 సీజన్లుగా ఫస్ట్ మ్యాచ్‌లో ఓటమి
## అయినా 5 సార్లు టైటిల్ కైవసం

**న్యూఢిల్లీ:** ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) చరిత్రలో ముంబై ఇండియన్స్ ఇండియన్ అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటి. ఐదుసార్లు టైటిల్ విజేతగా నిలిచిన ఈ జట్టుకు తొలి మ్యాచ్‌లో మాత్రం ఓడిపోవడం అలవాటుగా మారింది. ప్రస్తుత ఐపిఎల్ 2025, 18వ సీజన్‌లోనూ అదే సీన్ రిపీట్ అయింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఓటమిపాలైంది. దీంతో గత 13 సీజన్లుగా తొలి మ్యాచ్‌లో ఓడిపోయే పరంపర కొనసాగుతోంది. 2013 నుంచి ముంబై ఇండియన్స్ ఏ ఐపిఎల్ సీజన్‌లోనూ తొలి మ్యాచ్‌లో గెలవలేదు. చివరిసారిగా 2012లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. అయినప్పటికీ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొనిన ఐదు సార్లు టైటిల్ గెలుచుకుంది. ఈ 13 సీజన్లలో ముంబై ఇండియన్స్ ముగ్గురు కెప్టెన్లను మార్చింది. అయినా ఫలితం మాత్రం మారలేదు. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్లుగా ఉన్నా, తొలి మ్యాచ్‌లో విజయం సాధించలేకపోయారు. ఈ నెల 23న చెన్నైతో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో ముంబై తొలుత బ్యాటింగ్ చేసి 155 పరుగులు చేసింది. ముంబై బ్యాటింగ్ లైనప్ విఫలమైంది. చెన్నై బౌలర్ నూర్ అహ్మద్ 4 వికెట్లు తీశాడు. రచిన్ రవీంద్ర (65 నాటౌట్) రాణించడంతో చెన్నై విజయం సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ (53) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ముంబై రికార్డ్ ఐపిఎల్‌లో అత్యధిక సీజన్లలో తొలి మ్యాచ్‌లో ఓడిన రికార్డు ముంబై పేరిట ఉంది. అయితే, ఇలా తొలి మ్యాచ్‌లో ఓడిపోయినా. ఆ తర్వాత పుంజుకుని ఐదుసార్లు టైటిల్ విజేతగా నిలిచింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2013, 2015, 2017, 2019, 2020లలో టైటిళ్లను ముంబై ఇండియన్స్ సాధించింది. ఆ సమయాల్లో కూడా ఐపిఎల్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో ఓటములే ఎదురయ్యాయి. అదే సంప్రదాయాన్ని ఈ ఐపిఎల్ 18వ సీజనులోనూ పునరావృతం కావడం ముంబై ఇండియన్స్ అభిమానులకు ఇది నిరాశ కలిగించే విషయమే అయినప్పటికీ, టోర్నమెంట్ ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. మరి ఈ సారి ముంబై ఇండియన్స్ జట్టు పరిస్థితి ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా తయారయింది.



## ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి రేస్‌లో..
# విజేతగా ఆస్కార్ పియాస్ట్రి
## హామిల్టన్, లెక్‌లెర్క్, పియరీ గ్యాస్లీలపై అనర్హత వేటు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో మెక్లారెన్ జట్టు అదరగొడుతోంది. ఈ సీజన్‌లోని తొలి రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్‌జట్టు డ్రైవర్ లాండో నోరిస్ విజేతగా నిలిచాడు. ఇక రెండో రేసు చైనా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ జట్టుకే చెందిన రెండో డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి టైటిల్ సొంతం చేసుకున్నాడు. షాంఘైలో జరిగిన ప్రధాన రేసును పోల్ పొజిషన్‌తో ఆరంభించిన 23 ఏళ్ల పియాస్ట్రి రేసు ముగిసే వరకూ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. నిర్ణీత 56 ల్యాప్‌ల రేసును ఆస్ట్రేలియా జాతీయుడైన పియాస్ట్రి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 30 నిమిషాల 55.026 సెకన్లలో ముగించి చాంపియన్‌గా అవతరించాడు. 2023లో మెక్లారెన్ జట్టు తరఫునే ఫార్ములా వన్‌లో అరంగేట్రం చేసిన పియాస్ట్రి వరుసగా మూడో ఏడాది అదే జట్టుతో ఉన్నాడు. గత ఏడాది హంగేరి గ్రాండ్‌ప్రి, అజర్ బైజాన్ గ్రాండ్‌ప్రిలలో అగ్రస్థానాన్ని దక్కించుకున్న పియాస్ట్రి తాజా గెలుపుతో తన కెరీర్‌లో మూడో విజయాన్ని అందుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. నోరిస్ 1 గంట 31 నిమిషాల 04.774 సెకన్లలో గమ్యానికి చేరాడు. ఫార్ములా వన్ రేసులో ఓవరాల్‌గా 1-2 స్థానాలు మెక్‌లారెన్ జట్టు డ్రైవర్లే సొంతం చేసుకోవడం ఇది 50వ సారి అయింది. మెర్సిడెస్ డ్రైవర్ జార్జి రసెల్ మూడో స్థానంలో నిలువగా, ప్రస్తుత ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక ఫెరారీ జట్టు డ్రైవర్లు చార్లెస్ లెక్‌లెర్క్, లూయిస్ హామిల్టన్ వరుసగా ఐదు, ఆరు స్థానాల్లో నిలిచారు. అలాగే పియరీ గ్యాస్లీ (ఆల్పైన్) 11వ స్థానంలో నిలిచారు. అయితే సాంకేతిక కారణాలరీత్యా రేసు ముగిశాక ఈ ముగ్గురిపై అనర్హత వేటు వేశారు. లెక్‌లెర్క్ 10 పాయింట్లను, హామిల్టన్ 8 పాయింట్లను చేజార్చుకున్నారు. 11వ స్థానంలో నిలిచినందుకు గ్యాస్లీకి ఎలాంటి పాయింట్లు లభించలేదు. ఫార్ములా వన్ నిబంధనల ప్రకారం రేసు ముగిసిన తర్వాత డ్రైవర్ల కారు కనిష్ట బరువు 800 కేజీలు ఉండాలి. అయితే లెక్‌లెర్క్, హామిల్టన్, గ్యాస్లీల కార్ల బరువు 799 కేజీలు చూపించింది. దాంతో ఈ ముగ్గురిపై రేసు నిర్వాహకులు వేటు వేసి వారిఫలితాలను రద్దు చేశారు.

## ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీనిధి డ్రా



**న్యూఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఆరో డ్రా నమోదు చేసుకుంది. చర్చిల్ బ్రదర్స్ ఎఫ్సీ జట్టుతో పనాజీలో జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు 1-1 గోల్స్‌తో డ్రా చేసుకుంది. ఇంటర్ కాశీ జట్టుతో జరిగిన గత మ్యాచ్‌లో స్టాపేజ్ టైమ్‌లో గోల్ సమర్పించుకొని గెలవాల్సిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు డ్రాతో సరిపెట్టుకోగా, చర్చిల్ బ్రదర్స్ జట్టుతో స్టాపేజ్ టైమ్‌లో (90+11వ నిమిషంలో) గోల్ సాధించి ఓడిపోవాల్సిన మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కింది. స్టాపేజ్ టైమ్‌లో లభించిన పెనాల్టీ కిక్‌ను శ్రీనిధి డెక్కన్ జట్టు స్టార్ ప్లేయర్ డేవిడ్ కాస్టనెడా గోల్గా మలిచాడు. ఈ లీగ్‌లో టాప్ గోల్ స్కోరర్‌గా కొనసాగుతున్న కాస్టనెడాకిది 15వ గోల్ కావడం విశేషం. అంతకు ముందు 29వ నిమిషంలో పాపె గసామా చేసిన గోల్‌తో చర్చిల్ బ్రదర్స్ జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక 13 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 20 మ్యాచ్‌లు పూర్తిచేసుకుంది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో గెలిచి, మరో 7 మ్యాచ్‌ల్లో ఓడి, ఇంకో 6 మ్యాచ్‌లను డ్రాగా ముగించి 27 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. శ్రీనిధి హైదరాబాద్ జట్టు తమ తదుపరి మ్యాచ్ ఈనెల 30 గోకులం కేరళ ఎఫ్సీ జట్టుతో ఆడుతుంది.

## సెపక్ తక్రా వరల్డ్ కప్‌లో..
# భారత్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ సెపక్‌తక్రా ప్రపంచకప్ 2025 డబుల్స్ ఈవెంట్స్ విభాగంలో, భారత మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకోవడం ద్వారా అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. బీహార్ రాజధాని పాట్నాలో మయన్మార్ జట్టుతో జరిగిన గట్టి పోటీలో ఆ జట్టు స్వర్ణాన్ని కోల్పోయింది. సెపక్ తక్రా ప్రపంచ కప్‌లో ఉమెన్స్ డబుల్స్ ఫైనల్‌లో భారత మహిళల జట్టు రజతంతో సత్తా చాటింది. ఈ మ్యాచ్‌లో భారత్ 0-2 (9-15, 9-15)తో మలేషియాచేతిలోఓడింది. 20 దేశాలు పోటీపడు తున్న ఈ టోర్నీలో మహిళల డబుల్స్ ఈవెంట్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. కాగా మొదటి ప్రయత్నంలోనే భారత జట్టు రజతం దక్కించుకోవడం విశేషం. పురుషుల డబుల్స్‌లోనూ భారత జట్టు కాంస్యం గెలిచింది. ఈ టోర్నీలో భారత జట్టు ఇప్పటికే ఒక రజతం, మూడు కాంస్యాలు సాధించగా మరో మూడు విభాగాల్లో పతకాలు దక్కించుకునే దిశగా ముందుకు సాగుతోంది.

ఇక మహిళల డబుల్స్ విభాగంలో జపాన్ మరియు ఇరాన్ సంయుక్తంగా కాంస్యం సాధించాయి. డబుల్స్ ఈవెంట్‌లో, భారత పురుషుల జట్టు మలేషియాతో కలిసి కాంస్య పతకాన్ని గెలుచుకోవడంలో విజయవంత మైంది. పురుషుల డబుల్స్ చివరి మ్యాచ్ థాయిలాండ్ మరియు మయన్మార్ మధ్య జరిగింది. పురుషుల డబుల్స్‌లో థాయిలాండ్ స్వర్ణం, మయన్మార్ రజత పతకం గెలుచుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లు కూడా ఈ రోజే ప్రారంభమయ్యాయి. సెపక్ తక్రా యొక్క సాధారణ కార్యక్రమాలు రేపటి నుండి జరుగుతాయి. పాట్నా సెపక్ తక్రా ప్రపంచ కప్ 2025 మార్చి 25న ముగియనున్నాయి.

# న్యూజిలాండ్‌కే టి20 సిరీస్
## ఏకపక్ష పోరులో 115 తేడాతో పాకిస్తాన్‌పై గెలుపు



**న్యూఢిల్లీ:** టి20 సిరీస్‌ను న్యూజిలాండ్ కైవసం చేసుకోగా, పాకిస్థాన్‌కు పరాభవమే ఎదురైంది. నాలుగో టి20లో పాకిస్తాన్ చిత్తుగా ఓడింది. న్యూజిలాండ్‌లోని మోంట్ మాంగనీలో ఏకపక్షంగా సాగిన పోరులో ఆతిథ్య న్యూజిలాండ్ 115 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలుపొందింది. ఫలితంగా 5 మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు సీఫెర్ట్, అలెన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. బౌలర్‌తో సంబంధం లేకుండా ఈ జోడీ ఎడాపెడా బౌండరీలతో చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లో 2 సిక్సులు బాదిన సీఫెర్ట్, అబ్రార్ వేసిన నాలుగో ఓవర్లో 6, 4, 6 కొట్టాడు. దీంతో 4 ఓవర్లు ముగిసేసరికి న్యూజిలాండ్ 54 పరుగులు చేసింది. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (22 బంతుల్లో 44; 3 ఫోర్లు, 4 సిక్సులు), ఫిన్ అలెన్ (20 బంతుల్లో 50; 6 ఫోర్లు, 3 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. బ్రేస్‌వెల్ (26 బంతుల్లో 46 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, మార్క్ చాప్‌మన్ (24; 2 ఫోర్లు, 2 సిక్సులు), మిచెల్ (29; 1 ఫోర్, 1 సిక్స్) ఉన్నంతసేపు దూకుడు కనబర్చారు. పాకిస్తాన్ బౌలర్లలో హారీస్ రవూఫ్ 3, అబ్రార్ అహ్మద్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ పూర్తిగా తడబడింది. 16.2 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. మొత్తం జట్టులో అబ్దుల్ సమద్ (30 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సులు), ఇర్ఫాన్ ఖాన్ (24; 4 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. గత మ్యాచ్ సెంచరీ హీరో హసన్ నవాజ్ (1), కెప్టెన్ ఆఘా సల్మాన్ (1), మొహమ్మద్ హారీస్ (2), షాదాబ్ ఖాన్ (1), ఖుష్దిల్ షా (6) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 4, ఫోల్క్స్ 3 వికెట్లు పడగొట్టారు. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రమైన చివరి టి20 ఈ నెల 26న వెల్లింగ్టన్‌లో జరుగుతుంది.

# ఐదేళ్లలో మూడో అతిపెద్ద వాణిజ్య దేశంగా భారత్

**న్యూఢిల్లీ, మార్చి 24:** వచ్చే ఐదేళ్లలో ప్రపంచ వాణిజ్య వృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని డిహెచ్‌ఎల్ ట్రేడ్ అట్లాక్ నివేదిక అభిప్రాయపడింది. ఈ సమయంలో ప్రపంచ వాణిజ్యంలో భారత వాటా 6 శాతానికి చేరుకుంటుందని, ఇది చైనా 12శాతం, యుఎస్ 10శాతం తర్వాత మూడో స్థానానికి చేరుకుంటుందని నివేదిక తెలిపింది. ప్రధానంగా భారత్‌తో పాటు వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ లాంటి ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలతో పాటు అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ ప్రాధాన్యత వేగంగా పెరుగుతోంది. ఈ దేశాలు వేగవంతమైన, ఆర్థిక వాణిజ్యంలో మొదట 30 దేశాల జాబితాలో ఉంటాయని నివేదిక అంచనా వేసింది. మిగిలిన దేశాల కంటే భారత్ మరింత వేగవంతంగా మూడో అతిపెద్ద వాణిజ్య దేశంగా నిలవనుంది. ఇటీవలి సంవత్సరాల గణాంకాల ప్రకారం, 2024లో ప్రపంచ వ్యాప్తంగా 13వ అతిపెద్ద వాణిజ్య దేశంగా ఉన్న భారత్, 2019- 2024 మధ్య ప్రతి యేటా 5.2శాతం వాణిజ్య వృద్ధి రేటును నమోదు చేసింది. అదే సమయం లో ప్రపంచ వాణిజ్య వృద్ధి రేటు 2 శాతం కంటే ఎక్కువ కావడం విశేషం. ఆర్థికంగా భారత్ స్థిరంగా ఉండడం, అంతర్జాతీయంగా అనేక దేశాలతో భారత్ కలిగే ఉన్న నెట్‌వర్క్ కూడా ప్రపంచ వాణిజ్యంలో వాటా పెరుగుదలకు కారణమని నివేదిక పేర్కొంది. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, అమెరికా, చైనాలతో సన్నిహితంగా లేని దేశాలతో వాణిజ్యవాటా క్రమంగా పెరుగుతోంది. ఇది 2016లో 42శాతం నుంచి 2024లో 47శాతానికి చేరుకుందని నివేదిక వెల్లడించింది.



# జోరు తగ్గని స్టాక్ సూచీలు



**ముంబై, మార్చి 24:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలను ముందుండి నడిపించాయి. దీంతో వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్ లోనూ సూచీలు భారీగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా లాభపడడంతో చాలా రోజుల తర్వాత మళ్లీ 78 రోజుల మార్కును అందుకుంది. నిఫ్టీ 23,700 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.418 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం ఒక శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 77,456.27 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,107.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1078.87 పాయింట్ల లాభంతో 78వేలకు కాస్త దూరంలో 77,984.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 23,700 పాయింట్ల మార్కును దాటింది. చిరికి 307.95 పాయింట్లు లాభపడి 23,658.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి 85.64కు చేరింది. ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. గత కొన్ని నెలలుగా విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలకు దిగడంతో మార్కెట్లు తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాయి. గత మూడు నాలుగు సెషన్లుగా నెట్ బయ్యర్లుగా నిలుస్తుండడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. శుక్రవారం పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దాదాపు రూ.7,470 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అమెరికాలో బాండ్ల రాబడి తగ్గుముఖం పట్టడం కూడా మన మార్కెట్లకు పాజిటివ్‌గా మారింది.

# ఎటిఎం ఛార్జీల పెంపు



**ముంబై, మార్చి 24:** ఎటిఎం ఇంటర్‌ఛేంజ్ ఫీజుల పెంపునకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఆర్థిక లావాదేవీలకు రూ.2, ఆర్థికేతర లావాదేవీలకు రూ.1 ఛార్జీలను పెంచింది. మే 1 నుంచి అమల్లోకి రానున్న ఈ ఛార్జీల పెంపు పరిమిత ఎటిఎం నెట్‌వర్క్ ఉన్న చిన్న బ్యాంకులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. పెంచిన ఇంటర్‌ఛేంజ్ ఫీజులను కస్టమర్లకు బదిలీ చేయాలా వద్దా అనే దానిపై బ్యాంకులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ చివరికి భారాన్ని వినియోగ దారులపైనే వేస్తారన్న చర్చ సాగుతోంది. గత పదేళ్లలో ఇంటర్ చేంజ్ ఫీజులను సవరించినప్పుడల్లా బ్యాంకులు ఆ భారాన్ని కస్టమర్ల పైనే వేశాయి. ఈసారి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ ఉండదని, బ్యాంకులు కస్టమర్లకు ఫీజులు పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎటిఎం ఇంటర్ చేంజ్ ఫీజు అనేది ఎటిఎం సేవలను ఉపయోగించడానికి ఒక బ్యాంకు మరొక బ్యాంకుకు చెల్లించే ఛార్జీ. ఆర్‌బిఐ గతంలో 2021 జూన్‌లో ఇంటర్‌చేంజ్ ఫీజును సవరించింది. నగదు ఉపసంహరణ వంటి ఆర్థిక లావాదేవీలకు ఇంటర్ఛేంజ్ ఫీజును రూ.17 నుంచి రూ.19కి, బ్యాలెన్స్ ఎంక్వైరీలు వంటి ఆర్థికేతర లావాదేవీలకు ఇంటర్ఛేంజ్ ఫీజును రూ.6 నుంచి రూ.7కు పెంచారు. ఇంటర్ఛేంజ్ ఫీజుల పెంపునకు అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పిసిఐ) మార్చి 13న బ్యాంకులు, ఇతర వాటాదారులకు తెలియచేసింది. ఇంటర్‌ఛేంజ్ ఫీజుల పెంపును అమలు చేసేందుకు ఎన్‌పిసిఐ ఆర్‌బిఐ అనుమతి కోరింది. ప్రస్తుత ఫీజు విధానంలో కార్యకలాపాలు నడపడం ఆర్థికంగా కష్టంగా ఉన్న వైట్ లేబుల్ ఎటిఎం ఆపరేటర్ల విజ్ఞప్తుల మేరకు ఇంటర్ ఛేంజ్ ఫీజును పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# 5జి విస్తరణపై నోకియా నివేదిక..



**ముంబై, మార్చి 24:** దేశంలో వివిధ టెలికం సంస్థలు 5జి నెట్‌వర్క్ పరిధిని విస్తరిస్తు న్నాయి. ఇందుకోసం అవసరమయ్యే మౌలిక సదు పాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇటీవల విడుదలైన 'నోకియా 2024 మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ రిపోర్ట్' దేశీయ 5జి నెట్‌వర్క్ విస్తరణను విశ్లేషించింది. దేశవ్యాప్తంగా మెరుగవు తున్న టెలికం కనెక్టివిటీని ఈ నివేదిక హైలైట్ చేసింది. 2024లోనే 5జి డేటా ట్రాఫిక్ మూడు రెట్లు పెరగడం విశేషం. మెట్రోపాటిటన్ ప్రాంతాల్లో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ వాడయంలో 5జి నెట్‌వర్క్ ప్రస్తుతం 43శాతం వాటాను కలిగి ఉంది. 2023 నుంచి ఈ వాటా దాదాపు రెట్టింపు అయింది. 2024లో ప్రతి వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 27.5 జిబికి చేరు కుంది. గత ఐదేళ్లలో 19.5శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు చొప్పున ఈ వినియోగం పెరిగింది. స్మార్ట్‌ఫోన్లు పెరగడం, మెరుగైన ఇంటర్నెట్ సేవలు, డిజిటల్ కంటెంట్ వ్యాప్తి ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి. దేశంలో 5జి ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు కావాల్సిన పరికరాలు, మౌలిక సదుపాయాలు రెట్టింపు అవుతున్నాయి. 2025 నాటికి దేశంలో దాదాపు 90శాతం స్మార్ట్‌ఫోన్లు 5జి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని అంచనా.

# అదానీ గ్రూప్‌కు రూ.3.4 లక్షల కోట్ల నష్టం..

**ముంబై, మార్చి 24:** 2025 ఆర్థిక సంవత్సరం అదానీ గ్రూప్‌కు చాలా అస్థిరంగా ఉంది. గ్రూప్ కంపెనీల షేర్లలో గణనీయమైన క్షీణత కనిపించింది. ఈ క్షీణతకు ప్రధాన కారణం అమెరికాలో వచ్చిన ఆరోపణలే. దీనిని అదానీ గ్రూప్ ఎప్పుడూ అంగీకరించలేదు. స్టాక్ మార్కెట్ డేటాను పరిశీలిస్తే, 2025 ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ మార్కెట్ 21 శాతం లేదా రూ.3.4 లక్షల కోట్ల నష్టాన్ని చవిచూసింది. నివేదిక ప్రకారం.. అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. ఈసంవత్సరం వారి మార్కెట్ కేపిటలైజేషన్‌లో దాదాపు సగభాగాన్ని తుడిచిపెట్టాయి. ఆతర్వాత అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉంది. అదానీగ్రీన్ ఎనర్జీ మొత్తం మార్కెట్ క్యాప్ రూ.1.46 లక్షల కోట్లు కాగా, మార్చి 28, 2024న, ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజు, కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2.90 లక్షల కోట్లుగా నమోదైంది. దీని అర్థం కంపెనీ తన మార్కెట్ క్యాప్‌లో దాదాపు 50 శాతం కోల్పోయింది. ఈ సంవత్సరం షేరు ధర 27 శాతం పడిపోయిన గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్, మార్కెట్ క్యాప్‌లో రెండవ అతిపెద్ద క్షీణతను రూ. 94,096 కోట్లకు చేరుకుంది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ కూడా క్షీణతను చూసింది. అదే కాలంలో దాని మార్కెట్ కేపిటలైజేషన్ రూ.33,029 కోట్లు లేదా 11.40 శాతం తగ్గింది. అదానీ టోటల్ గ్యాస్ మార్కెట్ క్యాప్ 31.84శాతం తగ్గింది. అంటే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.32,411.40 కోట్లు తగ్గింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మార్కెట్ క్యాప్ 18.95 శాతం తగ్గి రూ.14,546.59 కోట్లకు చేరుకుంది. అదానీ యాజమాన్యంలోని సిమెంట్ స్టాక్స్ కూడా క్షీణించాయి. ఏసీసీ, అంబుజా సిమెంట్స్ వరుసగా 23.10శాతం, 15.92శాతం పడి పోయాయి. అదానీ విల్మార్ 17.35శాతం క్షీణించగా, సంఘి ఇండస్ట్రీస్ 36.84శాతం క్షీణించాయి. ప్రాంతీయ అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ అదానీ పవర్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 2.11శాతం స్వల్ప క్షీణతను చూసింది. 2025లో అదానీ స్టాక్ క్షీణతకు విస్తృత స్టాక్ మార్కెట్ బలహీనతతో సహా అనేక కారణాలు కారణమని చెప్పవచ్చు. మార్చి 31, 2025తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఈక్విటీ మార్కెట్ స్థూల ఆర్థిక సవాళ్లు, బలహీనమైన పట్టణ వినియోగం, ట్రంప్ సుంకాల చుట్టూ అనిశ్చితితో సహా భౌగోళిక రాజకీయ నష్టాలను ఎదుర్కొంటుంది.



# వాణిజ్యం

## చిన్న విక్రేతలకు అమెజాన్ గుడ్‌న్యూస్..

**ముంబై, మార్చి 24:** ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ తమ వేదికపై ఉత్పత్తులు విక్రయించే చిన్న విక్రేతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. 135 కేటగిరీలకు చెందిన రూ.300 కంటే తక్కువ విలువ కలిగి 1.2 కోట్ల ఉత్పత్తులకు సెల్లర్ ఫీజును రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఏప్రిల్ 7నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు తమ వేదికను ఉపయోగించుకొని ఉత్పత్తులు విక్రయించినందుకుగానూ సెల్లర్ల నుంచి అమెజాన్ కమీషన్ తీసుకుంటుంది. ఈ మొత్తం కేటగిరీని బట్టి 2 శాతం నుంచి 16శాతం వరకు ఉంటుంది. అమ్మకం ధర ఆధారంగా ఈ ఫీజును నిర్ణయిస్తుంటుంది. దీంతోపాటు వెయిట్ హ్యాండ్లింగ్, షిప్పింగ్ ఛార్జీలను కూడా అమెజాన్ తగ్గించింది. ఈజీ



షిప్, సెల్లర్ ఫ్లెక్స్ వంటి ఇతర ఫుల్‌ఫిల్‌మెంట్ ఛానెల్స్ ద్వారా చేసే షిప్పింగ్ రేట్లను రూ.77 నుంచి రూ.65కి తగ్గించినట్లు అమెజాన్ తెలిపింది. వెయిట్ హ్యాండ్లింగ్ ఫీజును కూడా కేజీకి రూ.17 వరకు తగ్గిస్తున్నట్లు పేర్కొంది. సెల్లర్ ఎవరైనా ఒకటి కంటే ఎక్కువ వస్తువులను షిప్పింగ్ చేసినప్పుడు రెండో వస్తువుపై 90శాతం మేర సెల్లింగ్ ఫీజును ఆదా చేసుకోవచ్చని అమెజాన్ ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ఫీజు విధానంలో రెండు కొంటే 10 శాతం తగ్గింపు వంటి ఆఫర్లను ప్రకటించడం ద్వారా సెల్లర్లు ఎక్కువ ఆదా చేసుకోవడం వీలుపడుతుందని అమెజాన్ తెలిపింది. తక్కువ ధరకు, మరిన్ని ఉత్పత్తులను విక్రయించుకోవడానికి వీలుగా తమ వేదికను తీర్చిదిద్దే ఉద్దేశంతో ఫీజు విధానంలో మార్పులు చేపట్టినట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. చిన్న విక్రేతలకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్‌లోనూ 59 రకాల ఉత్పత్తులపై సెల్లర్ ఫీజును 3 నుంచి 12శాతం మేర తగ్గించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.